ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 8 ఏప్రిల్ 2025



డీఆర్ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతల స్వీకారం

7


త్వరలో డాక్టర్ పోస్టుల భర్తీ

వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ జనార్ధన్



- అటెండెన్స్ మార్కింగ్ చేయని సచివాలయాల ఉద్యోగులు
- 3 జిల్లాల ఉద్యోగులది ఇదే తీరు
- అదేమని ప్రశ్నిస్తే కుంటి సాకులు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట ఆదేశాలు

హాజరు ఉంటేనే.. జీతాలు



గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో ఇంకా కొంత మందిలో నిర్లక్ష్య ధోరణి పోవడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ వ్యవస్థలో నియమితులైన ఉద్యోగులు తాము ప్రత్యేకమన్న రీతిలో వ్యవహరించే వారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల ఆదేశాలు ఖాతరు చేసే వాళ్లు కాదు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. సచివాలయాల ఉద్యోగులంతా హ్యూమన్ రిసోర్సు మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్/యాప్‌లో లాగిన్ అయి తప్పక ఇన్ వార్డు, అవుట్‌వార్డు హాజరుని మార్కింగ్ చేయాలని పదేపదే ప్రభుత్వం ఆదేశిస్తున్నా కొందరిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఏవేవో కుంటిసాకులు చెబుతూ హాజరు వేయకుండా జీతాలు డ్రా చేస్తున్నారు. దీని వలన సర్వీసు డెలివరీ, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడంలో ఇబ్బందులు తలెత్తు తుండటంతో ఇక నుంచి ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మూడు జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

సచివాలయాల వ్యవస్థ ఏర్పాటైన తర్వాత 2021వ సంవత్సరం ఫిబ్రవరి నాల్గో తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క ఉద్యోగి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పక రోజుకు రెండు సార్లు వేయాలని ఆదేశించింది. ఆ తర్వాత ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఎంఎస్ యాప్‌ని ప్రతి ఒక్క ఉద్యోగికి తీసుకొచ్చింది. ఇది జియో కో-ఆర్డినేట్స్ ఆధారంగా అటెండెన్స్‌ని మార్కింగ్ చేస్తుంది. ఉద్యోగి సంబంధిత సచివాలయానికి 300 మీటర్ల లోపు ఉంటే అటెండెన్స్ మార్కింగ్ అవుతుంది. ప్రతి ఒక్క ఉద్యోగికి జాబ్ చార్ట్ ప్రకారం ఇన్‌వార్డు, అవుట్‌వార్డు టైమింగ్స్ ఉన్నాయి. అయినప్పటికి కొందరు నిర్లక్ష్య ధోరణితో ఉంటూ సమయానికి వచ్చి అటెండెన్స్‌ని మార్కింగ్ చేయకుండా లేటుగా వస్తున్నారు. కొందరైతే సాయంత్రం వచ్చి ఇన్ వార్డు, అవుట్‌వార్డు రెండూ ఒకే సారి నిమిషాల వ్యవధిలో మార్కింగ్ చేస్తున్నారు. అదేమంటే తాము ఫీల్డ్‌లో ఉన్నామని, ఫలాన అధికారి పని చెప్పారని, పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని వంటి ఏవేవో కారణాలు చెబుతున్నారు.

> ■ గుంటూరు జిల్లాలో 568 గ్రామ/వార్డు సచివాలయాలుండగా 4806 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3696 మంది హెచ్‌ఆర్ ఎంఎస్ పోర్టల్‌లో అటెండెన్స్‌ని సక్రమంగా మార్కిం గ్ చేస్తున్నారు. 1109(23 శాతం) మంది అటెండెన్స్‌ని మార్క్ చేయడం లేదు. బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలుంటే 4,259 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3182 మంది హాజరు వేస్తు న్నారు. 1077 (25 శాతం) మంది పోర్టల్/యాప్‌లో హాజరు మార్క్ చేయడం లేదని తేలింది. పల్నాడు జిల్లాలో 538 సచివాలయంటే 4456 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీళ్లలో 3536 మంది మాత్రమే నిత్యం హాజరుని మార్కింగ్ చేస్తున్నారు. 920(21 శాతం) మంది హాజరుకు దూరంగా ఉంటున్నారు.

ఈ నేపథ్యంలో కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)లను సక్రమంగా పర్యవేక్షించ లేని పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. ముఖ్యంగా ప్రజలకు సర్వీసు డెలివరీ సకాలంలో చేయ లేని పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ కారణాలతో హెచ్‌ఆర్ఎం పోర్టల్‌లో అటెండెన్స్ వేస్తేనే జీతాలు విడుదల చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో మూడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి తరచుగా సమీక్షించాలని సూచించింది. అలానే గుంటూరు జిల్లాలో 86, బాపట్లలో 56, పల్నాడులో ఏడుగురు సచివాలయాల ఉద్యోగులను డిప్యూటేషన్‌పై వేరే పనులకు వినియోగిస్తున్నారు. తక్షణమే వాటన్నింటిని రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా విపత్తులు సంభవించినప్పుడు మాత్ర మే అది కూడా ఏడు రోజులకు మించి డిప్యూ టేషన్ చేయొద్దని స్పష్టం చేసింది. సీఆర్‌డీఏకి చేసిన డిప్యూటేషన్లు మినహా మిగిలిన వన్నింటిని రద్దు చేయాల్సిందేనని, సిబ్బంది సచివాలయాల నుంచే విధులు నిర్వహించా లని తేల్చి చెప్పింది.

రబీ ధాన్యం.. సేకరణకు సిద్ధం!



- నేటి నుంచి తెరుచుకోనున్న కొనుగోలు కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బాపట్ల జిల్లాలో రబీకి 10,000 టన్నుల నుంచి 30,000 వరకు పెంపు
- పల్నాడు జిల్లాలో 10,000 టన్నుల సేకరణకు అనుమతి
- లేట్ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాని స్పష్టత

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రబీ ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 42 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించనున్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి రబీ సీజన్‌లో 62,000 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి ఉంటుందనేది అంచనాగా ఉంది. మూడు వారాల క్రితం రబీ సీజన్‌లో 40,000 టన్నుల సేకరణకు అధికారులు ప్రతిపాదనలు పంపంగా 10,000 టన్నులకే గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కానీ తాజాగా ఇచ్చిన ఆదేశాలలో ప్రభుత్వం దానిని 30,000 వరకు పెంచింది. పల్నాడు జిల్లాకు వచ్చేసరికి రబీలో 10,000 టన్నుల సేకరణకు అనుమతులు వచ్చాయి. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ప్రభుత్వం రబీలో కూడా అదే ఒరవడి కొనసాగిస్తామని ధీమాగా చెబుతోంది. 75 కేజీల ధాన్యం బస్తా ధర గ్రేడ్-ఏ రకం మద్దతుధర రూ.1740 ఉండగా, కామన్ రకం రూ.1725గా ఉంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో మద్దతు ధరకన్నా రూ.150 నుంచి రూ.200 తక్కువగా ఉండడంతో రెతుల చూపు కొనుగోలు కేంద్రాల వైపే ఉంది. దీంతో మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రాలు వేదికగా కొనుగోళ్లు జరపనుండడంతో రైతులకు మేలు చేకూరనుంది.

ఈ సారి కూడా పెంచక తప్పదా...

ఖరీఫ్ సీజన్‌లో మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల పరిధిలో తొలుత ఇచ్చిన లక్ష్యం కంటే దశలవారీగా అనుమతులు పెంచుకుంటూ రావాల్సి వచ్చింది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌కు తొలుత ఇచ్చిన లక్ష్యం 50,000 టన్నులే కాగా అది ముగింపుకొచ్చేసరికి 92,000 టన్నుల వరకు వెళ్లింది. ఖరీఫ్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో రబీ ధాన్యం దిగుబడులు నామమాత్రంగా ఉండడంతో అక్కడ సేకరణ విషయంలో ఇంకా స్పష్టత లేదు. పల్నాడు జిల్లాలోనూ రబీకి సంబంధించి పెద్దగా సమస్యలు ఉత్పన్నం కాకపోవచ్చు కానీ బాపట్ల జిల్లాలో లేట్ ఖరీఫ్ దిగుబడులు దాదాపు 42,000 టన్నుల వరకు ఉండడంతో వాటిని మద్దతు ధరకు కొనే విషయంలో రైతాంగంలో ఆందోళన నెలకొంది.

పెంచింది లేట్ ఖరీఫ్ కోసమేనా..

రబీ సీజన్‌లో బాపట్ల జిల్లాకు తొలుత అనుమతి ఇచ్చింది పది వేల టన్నులే కాగా దానిని ఇప్పుడు 30,000 వరకు పెంచారు. లేట్ ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఈ పెంపు నిర్ణయం తీసుకుందా అనే విషయంలో స్పష్టత లేదు. లేట్ ఖరీఫ్ ధాన్యాన్ని రబీలో కొనడానికి ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధికారులు ఇప్పటికే రాష్ట్రస్థాయి కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. కానీ ఆ చిక్కులను తొలగించే విషయంలో ఇంకా ఓ నిర్ణయానికి రాలేదనేది సమాచారం.

ఏప్రిల్ చివరి వారంలో కానీ...

గత ప్రభుత్వంలో రబీ సీజన్ ధాన్యం సేకరణ విషయంలో ఏప్రిల్ చివరి వారంలో కానీ కదలిక మొదలయ్యేది కాదని, ఈ సారి ఏప్రిల్ రెండో వారంలోనే కొనుగోలు కేంద్రాలు తెరవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా తొలుత వచ్చిన అనుమతులతోనే సరిపెట్టకుండా రైతుల అభ్యర్థనల మేరకు పలు దఫాలుగా అధికారులు ప్రతిపాదనలు పంపి నేతల సహకారంతో వాటిని సాధించుకోవడం కూడా అన్నదాతలకు మేలు చేకూరుతోంది.

> **గోనె సంచులు..జీపీఎస్ వాహనాలు**
>
> రైతాంగం ప్రయోజనాలు దెబ్బ తీసే విధంగా మిల్లర్లు వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఖరీఫ్ సీజన్‌లో గట్టిహెచ్చరికలనే ప్రభుత్వం పంపించ గలిగింది. క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టడంతో చాలా వరకు మిల్లర్ల మాయాజాలానికి అడ్డుకట్ట వేయగలిగారు. ఖరీఫ్‌లో గోనె సంచుల సమస్య ఉత్పన్నమయింది. దీంతో రబీలో ముందుగానే బ్యాగులను పెద్ద ఎత్తున సంచులను సిద్ధం చేశారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసే వ్యవస్థతో పాటు అన్ని ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఈ విషయంలో ఎవరైనా మిల్లర్లు ఉల్లంఘనలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని ఇప్పటికే అధికారులు హెచ్చరించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిలకలూరిపేటలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్



ఫిర్యాదుల అందుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

చిలకలూరిపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గాల స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను (పీజీఆర్ఎస్) నిర్వహించాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలో ప్రప్రథమంగా చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్‌లో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడు కలెక్టర్ అరుణ్ బాబు కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. వారితోపాటు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, జేసీ సూరజ్ ధనుంజయ్, ఆర్డీవో మధులత, డీఆర్వో మురళి, జిల్లా ప్రధాన అధికార యంత్రాంగం హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రజల వద్ద నుంచి 300 ఫిర్యాదులు - కలెక్టర్

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 300ల అర్జీలు వచ్చాయని, వాటిలో 150కు పైగా రెవెన్యూ (భూ సమస్యలు) ఫిర్యాదులే ఉన్నాయని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. వాటిలో కూడా ఎక్కువగా సర్వే ఫిర్యాదులే ఉన్నాయన్నారు. భూ వివాదాల పరిష్కారంలో తాను అధికారులకు మొదటి నుంచి ఒకటే చెబుతున్నానన్న కలెక్టర్, తమ దృష్టికి అర్జీ వచ్చినప్పుడు ఏ అధికారి అయినా అర్జీదారుతో మాట్లాడి,వారు చెప్పేది వినాలని, అప్పుడే సమస్య తీవ్రత తెలుస్తుందన్నారు.

రెవెన్యూ సమస్యలే ఎక్కువ - ఎంపీ లావు

ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 14,598 ఫిర్యాదులు ప్రజల నుంచి వచ్చాయని, వాటిలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో వేగంతో పాటు, నాణ్యత కూడా ఉండాలని అన్నారు. రెవెన్యూ, భూ వివాదాలకు సంబంధించి పలు రకాల పత్రాలు కావాలని ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరైన పద్ధతి కాదని ఆయన చెప్పారు. ముఖ్యంగా భూ వివాదాల పరిష్కారంలో అధికారులు లోతైన దర్యాప్తు చేయాలని, భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పరిష్కారమార్గాలు సూచించాలని కోరారు. రెండు మూడు నెలల్లో ప్రజలకు పూర్తి న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

సమస్యల పరిష్కారం అధికారులు బాధ్యతగా భావించాలి - ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ప్రజలు ఫిర్యాదులు ఇచ్చారు, తీసుకున్నాం, మన పని పూర్తయింది అన్నట్టు కాకుండా అధికార యంత్రాంగం బాధ్యతతో పనిచేసి, ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. గత ప్రభుత్వంలో మాదిరి ఏకపక్షంగా ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేయకుండా, న్యాయం ఎవరిది, తప్పు ఎవరు చేశారు, అసలు సమస్య ఎక్కడ ప్రారంభమైందో ఆలోచించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఒకసారి తమదృష్టికి వచ్చిన సమస్యను అధికారు లు చట్టబద్ధంగా పరిష్కరించాలన్నారు. కోర్టువివాదాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వైపు నుంచి చేయాల్సింది కచ్చితంగా చేస్తే, ఏ సమస్య అయినా త్వరితగతిన పరిష్కారమవుతుందని అన్నారు.

స్థానికుల డిమాండ్లు పరిష్కరించాలి

చెట్టినాడ్, భవ్య సంస్థలకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీ అరుణ్‌కుమార్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : చెట్టినాడ్, భవ్య సిమెంట్స్ సంస్థలు స్థానికుల సమస్యలు పరిష్కరించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో ఫ్యాక్టరీలు తిరిగి ప్రారంభించే విషయమై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లా పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పారిశ్రామిక అభివృద్ధి కారణంగా నష్టపోతున్న వారి ప్రయోజనాలు అంతే ముఖ్యమన్నారు. దాచేపల్లి మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీల కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న తక్కెళ్ళపాడు, పెద గార్లపాడు, తంగెడ గ్రామస్థుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. భూములు కోల్పోయిన వారికి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చెట్టినాడ్, భవ్య సంస్థలు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వారం రోజులలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ నియామక పత్రాలు అందించాలన్నారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడే దుమ్ము కారణంగా దెబ్బతింటున్న పంటలు, మైనింగ్ కారణంగా దెబ్బతిన్న ఇళ్ళకు పరిహారం అందించాలన్నారు. ఫ్యాక్టరీల కార్యకలాపాల కారణంగా ప్రభావితమవుతున్న వ్యవసాయ భూములను సిమెంట్ సంస్థలే కొనుగోలు చేయడం లేదా లీజుకు తీసుకోవడం ద్వారా రైతులకు న్యాయం చేయాలన్నారు. ఫ్యాక్టరీలలో కనీసం 33 శాతం పచ్చదనం ఉండేలా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ప్రభావిత గ్రామాలలో తాగు నీటి సరఫరా వంటి కనీస అవసరాల కోసం రూ కోటి తగ్గకుండా సీఎస్సార్ నిధులు వెచ్చించాలన్నారు. భవ్య సిమెంట్స్ వారి ఫౌండేషన్ ఆధ్వర్యంలోని డీఏవీ పాఠశాలను రేపటి నుంచి ప్రారంభించక పోతే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, సామాజిక కార్యకర్త సిరామావిళ్ల వెంకటేశ్వరరావు, చెట్టినాడ్, భవ్య సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పురుషులకు.. గోల్డెన్ ఛాన్స్

పురుషులు వ్యాపార వేత్తలు కావాలని అనుకుంటున్నారా?, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించుకుంటున్నారా? ఐతే ప్రభుత్వం పురుషులకు సువర్ణ అవకాశం కల్పిస్తుంది. మహిళలకు ఉన్న గ్రూపుల మాదిరి పురుషులతోను గ్రూపులను ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నది. పల్నాడు జిల్లాలోని పురపాలక సంఘాల్లో ఇప్పటి వరకు 96 పురుషుల గ్రూపులను ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నెల నుంచి ఈ గ్రూపుల పని తీరు ప్రారంభం కానుంది. అలాగే ఈ గ్రూపుల సంఖ్యను రెట్టింపు చేసే పనిలో సంబంధిత అధికారులు ఉన్నారు.

- మగవారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- డ్వాక్రా తరహా గ్రూపుల ఏర్పాటు
- వ్యాపారాభివృద్ధికి లక్షకుపైగా రుణాలు
- పల్నాడులో ఇప్పటికే 96 గ్రూపుల ఏర్పాటు

సత్తెనపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల్లో డ్వాక్రా స్వయం సహాయక మహిళా సంఘాల తరహాలోనే పురుషులతోను స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి ఆ మేరకు ప్రణాళికలు రూపొందించి మెప్మా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలోని అన్ని పట్టణాల్లో పురుషుల గ్రూపు ఏర్పాటు ప్రారంభమైంది. మెప్మా ఆధ్వర్యంలో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా సంఘాల మాదిరిగానే పురుష పొదుపు సంఘాల్లోను కార్యకలాపాలు నిర్వహించనున్నారు. పురుష పొదుపు సంఘాలకు ఆర్థిక సాయం అందించి ఉపాధి కల్పించటం వంటి లక్ష్యాలను పురుషుల స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఈ గ్రూపుల పై సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో గ్రూపునకు పది మంది సభ్యులు ఉంటారు. పురుషుల సంఘంలో మాత్రం ఐదుగురు సభ్యులు ఉంటే సరి పోతుంది. ఈ పథకంలో వలస కూలీలు, అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికులు, తాపీ పనివారు, కార్పెంటర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్‌లు, కూలీలు, ఆన్‌లైన్ డెలవరీ బాయిస్, కూరగాయలు, నిత్యావసరాలు సరఫరా చేసే కార్మికులు, ఆటో రిక్షా కార్మికులు, హమాలీలు, తోపుడు బండ్ల పై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు ఇలా అనేక వర్గాలు గ్రూపుల్లో సభ్యులుగా చేరవచ్చు.



పురుషుల గ్రూపులపై అవగాహన కల్పిస్తున్న మెప్మా ఆర్‌పీ

లక్ష రూపాయల నుంచి పైనే ..

ప్రతి గ్రూపు నెల నెలా సమావేశ మై ఒక్కొక్క సభ్యుడు కనిష్టంగా వంద నుంచి రెండు వందల రూపాయల వరకు పొదుపు చేయాల్సి ఉంటుంది. ఆరు నెలల తరువాత ప్రతి గ్రూపునకు పొందుపు మొత్తంలో ఆరు రెట్లు, లక్ష రూపాయల నుంచి ఆ పై బ్యాంక్ రుణాలుగా ఇస్తారు. ఈ సొమ్మును కుటుంబ అవసరాలు, ఉపాధి మెరుగుపరుచుకొనేందుకు ఉపయోగించు కోవచ్చు. గ్రూపు సభ్యులు బ్యాంక్ రుణాలు, సకాలంలో చెల్లిస్తే మళ్ళీ అదనపు రుణాలు ఇస్తారు. అదే విధంగా మహిళా, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చినట్లే బ్యాంక్ లింకేజీ రుణాలు, పావలా వడ్డీ, సున్నా వడ్డీ రుణాలు పురుషుల ఎస్సీ ఎస్టీ గ్రూపులకు వర్తిస్తాయని మెప్మా అధికారులు చెపుతున్నారు. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లిలో 19, వినుకొండలో 10, పిడుగురాళ్ళలో 11, నరసరావుపేటలో 12, మాచర్లలో 12, గురజాలలో 8, దాచేపల్లిలో 9, చిలకలూరిపేటలో 15 పురుషుల పొదుపు గ్రూపులు ఇప్పటి వరకు ఏర్పడ్డాయి.

> **ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అవకాశం**
>
> పురుషులకు గ్రూపులు ఏర్పాటు చేయటం వల్ల ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వీలు కలుగుతుంది. గ్రూపు ఏర్పడి ప్రతి నెల పొదుపు చేసుకుంటే మూడు నెలల తరువాత వారికి రూ 20వేలు రివాల్వింగ్ ఫండ్ మంజూరవుతుంది. ఆరు నెలల తరువాత వారికి బ్యాంకుల ద్వారా లక్ష రూపాయలకు పైగా రుణం మంజూరవుతుంది.
>
> షేక్ ఖాజా, మెప్మా టీఎంసీ, సత్తెనపల్లి

ఉత్తమ ప్రదర్శనగా ‘నాన్నా నేనొచ్చేస్తా’

ముగిసిన పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నాటికల పోటీలు

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా జిల్లా జడ్జి పార్థసారథి

- గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కల్యాణ చక్రవర్తి

7

ప్రధాని సభకు ప్రత్యేకాధికారిగా **వీరపాండ్యన్**

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x లఖ్‌నవూ — మ.3.30 నుంచి — వేదిక: కోల్‌కతా

పంజాబ్ x చెన్నై — రా.7.30 నుంచి — వేదిక: చండీగఢ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్





నాన్నంటే.. ఎంతో భయం!

న్యూఢిల్లీ: చిన్నప్పుడు తనకు నాన్న పాన్ సింగ్ అంటే ఎంతో భయమనే విషయాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో మహేంద్ర సింగ్ ధోనీ బయటపెట్టాడు. ఆయన వల్లే ఎంతో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటైందని తెలిపాడు. తన కెరీర్‌ను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పాడు. 'నాన్న ఎంతో కఠినంగా ఉండేవారు. కానీ, ఎన్నడూ కోప్పడలేదు. ఎప్పుడూ సమయపాలన పాటించేవారు. అది నాకు కూడా అలవడింద'ని తెలిపాడు. తన తండ్రి వల్లే జీవితంలో ఎప్పుడూ అభద్రతా భావానికి గురికాలేదన్నాడు.

ఆర్‌సీబీ.. హమ్మయ్య



ఆఖరి ఓవర్‌లో అద్భుతం
విరాట్, రజత్ హాఫ్ సెంచరీలు
పోరాడి ఓడిన ముంబై
రాణించిన తిలక్

ముంబై: ఐపీఎల్ అభిమానులకిది అదిరిపోయే మ్యాచ్. బ్యాటింగ్‌లో చెలరేగిన బెంగళూరు ప్రత్యర్థి ముంబై ముందు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచినా.. ఆఖరి బంతి వరకూ ఉత్కంఠను రేకెత్తించింది. ఓ దశలో ముంబై ఓటమి లాంఛనమే అనిపించినా తిలక్ వర్మ (29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 42)ల దంచుడు ఆర్‌సీబీలో గుబులు రేపింది. కానీ కీలక దశలో వారి వికెట్లు తీసి తిరిగి పోటీలోకి రావడంతో పాటు, చివరి ఓవర్‌లో స్పిన్నర్ క్రునాల్ (4/45) మూడు వికెట్లు పడగొట్టి ఆర్‌సీబీని గట్టెక్కించాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రజత్ సేన 12 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే వాంఖడేలో ఈ జట్టు పదేళ్ల తర్వాత గెలవడం మరో విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 221 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 67), దేవ్‌దత్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37), రజత్ పటీదార్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 64), జితేశ్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 40 నాటౌట్) చెలరేగారు. హార్దిక్, బౌల్ట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 209 పరుగులు చేసి ఓడింది. హాజెల్‌వుడ్, యష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

చివర్లో బోల్తా: భారీ ఛేదనలో ముంబై ఆరంభం నుంచే ఇబ్బందిపడింది. ఆర్‌సీబీ బౌలర్లు కట్టడి చేయడంతో ఓపెనర్లు రోహిత్ (17), రికెల్టన్ (17) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అటు విల్ జాక్స్ (22)తో కలిసి సూర్యకుమార్ (28) మూడో వికెట్‌కు 41 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే సూర్య భారీ షాట్లు ఆడేందుకు కష్టపడ్డాడు. రెండు క్యాచ్ అవుట్ ప్రమాదం నుంచి తప్పించుకున్న తను చివరకు 12వ ఓవర్‌లో యష్‌కు చిక్కాడు. అప్పటికి స్కోరు 99/4గా ఉండడంతో ఇక ముంబైకి భారీ ఓటమి ఖాయమనిపించింది. కానీ ఈ దశలో తిలక్, హార్దిక్ బ్యాట్లు ఝుళిపించి వణుకు పుట్టించారు. 13వ ఓవర్‌లో తిలక్ 6,4,4.. 14వ ఓవర్‌లో హార్దిక్ 6,4,6,4తో 39 పరుగులు రావడంతో మ్యాచ్ ముంబై వైపు తిరిగింది. అలాగే తిలక్ 16వ ఓవర్‌లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ అంతా సవ్యంగా సాగుతున్న దశలో ముంబై వరుస ఓవర్లలో ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయింది. సమీకరణం 6 బంతుల్లో 19 రన్స్‌కి చేరింది. అయితే క్రునాల్ ఆరు పరుగులే ఇచ్చి శాంట్నర్ (8), చాహర్ (0), నమన్ (11)ల వికెట్లు తీసి ఆర్‌సీబీని సంబరాల్లో ముంచాడు.

ఆరంభం నుంచే దంచుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ జట్టు స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఓపెనర్ విరాట్ అనూహ్యంగా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగగా, దేవ్‌దత్, కెప్టెన్ రజత్, జితేశ్ కూడా అదరగొట్టడంతో బెంగళూరు భారీ స్కోరందుకుంది. చివరి ఐదు ఓవర్లలో జట్టు 70 పరుగులు సాధించింది. బుమ్రా ఒక్కడే కాస్త కట్టడి చేశాడు. అయితే తొలి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ సాల్ట్ (4)ను పేసర్ బౌల్ట్ బౌల్డ్ చేసినా.. జట్టు ఆటలో మాత్రం జోరు తగ్గలేదు. ముంబైపై బెంగళూరు తమ అత్యధిక పవర్‌ప్లే స్కోరు (73/1)ను సాధించింది. పడిక్కళ్‌ను స్పిన్నర్ విఘ్నేష్ అవుట్ చేసి రెండో వికెట్‌కు 52 బంతుల్లోనే 91 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. అనంతరం 10-13 ఓవర్ల మధ్య పరుగులు నెమ్మదించాయి. అయితే శాంట్నర్ ఓవర్‌లో 20 పరుగులు రావడంతో తిరిగి లయ అందుకుంది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్, లివింగ్‌స్టోన్ (0)లను హార్దిక్ అవుట్ చేశాడు. కానీ డెత్ ఓవర్లలో పటీదార్‌కు జితేశ్ జత కలవడంతో ముంబై బౌలర్లు గతి తప్పారు. 16వ ఓవర్‌లో జితేశ్ 4,6 రజత్ 4తో బౌల్ట్ 18 రన్స్ సమర్పించుకున్నాడు. ఇక ఆ తర్వాత పటీదార్ 6,6,4తో 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. హార్దిక్ వేసిన ఈ 17వ ఓవర్‌లో ఏకంగా 23 రన్స్ వచ్చాయి. 19వ ఓవర్‌లో జితేశ్ రెండు సిక్సర్లతో స్కోరు 200 దాటగా రజత్ వికెట్‌ను కోల్పోయింది. వీరి మధ్య ఐదో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. చివరి ఓవర్‌లో బుమ్రా 8 పరుగులే ఇచ్చి కాస్త ఊరటనిచ్చాడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (బి) బౌల్ట్ 4; విరాట్ (సి) నమన్ (బి) హార్దిక్ 67; పడిక్కళ్ (సి) జాక్స్ (బి) విఘ్నేష్ 37; పటీదార్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 64; లివింగ్‌స్టోన్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0; జితేశ్ (నాటౌట్) 40; డేవిడ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 221/5. వికెట్ల పతనం:** 1-4, 2-95, 3-143, 4-144, 5-213; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-57-2; దీపక్ 2-0-29-0; బుమ్రా 4-0-29-0; జాక్స్ 1-0-10-0; శాంట్నర్ 4-0-40-0; హార్దిక్ 4-0-45-2; విఘ్నేష్ 1-0-10-1.

ముంబై: రోహిత్ (బి) యశ్ దయాల్ 17, రికెల్టన్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 17, విల్ జాక్స్ (సి) కోహ్లీ (బి) క్రునాల్ 22, సూర్యకుమార్ (సి) లివింగ్‌స్టోన్ (బి) యశ్ దయాల్ 28, తిలక్ వర్మ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 56, హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) హాజెల్‌వుడ్ 42, నమన్ ధిర్ (సి)యశ్ దయాల్ (బి) క్రునాల్ 11, శాంట్నర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 8, దీపక్ చాహర్ (సి) టిమ్ డేవిడ్ (బి) క్రునాల్ 0, బౌల్ట్ (నాటౌట్) 1, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు 7 ; మొత్తం 20 ఓవర్లలో 209/9 ; వికెట్లపతనం :** 1-21, 2-38, 3-79, 4-99, 5-188, 6-194, 7-203, 8-203, 9/209 ; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-48-1, యశ్ దయాల్ 4-0-46-2, హాజెల్‌వుడ్ 4-0-37-2, సుయాష్ శర్మ 4-0-32-0, క్రునాల్ 4-0-45-4.



మనోళ్లు మురిపిస్తారా?

బరిలో సింధు, సేన్, ప్రణయ్

నేటినుంచి బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్

నింగ్బో (చైనా): ఇటీవలి కాలంలో జరిగిన అన్ని ప్రధాన టోర్నీలలో భారత షట్లర్లు తీవ్రంగా నిరాశ పరిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ ప్రారంభమయ్యే ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మనోళ్లు ఎలా రాణిస్తారోనన్న ఉత్కంఠ ఏర్పడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోడ్, అనుపమా ఉపాధ్యాయ, ఆకర్షి కశ్యప్ తలపడుతున్నారు. మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ద్వయం, పురుషుల్లో సాత్విక్/చిరాగ్ జంట టోర్నమెంట్‌లో పాల్గొనడంలేదు. తొలి రౌండ్‌లో తైపీకి చెందిన లీ చియాతో లక్ష్యసేన్ తలపడతాడు. గువాంగ్ జు (చైనా)తో ప్రణయ్, కంటపాన్ (ఇండోనేసియా)తో రజావత్, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ మొదటి రౌండ్‌లో అమీతుమీ తేల్చుకుంటారు. మహిళల సింగిల్స్‌లో..ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు-ఎస్తేర్ నురుమి (ఇండోనేసియా)తో టోర్నీని ప్రారంభిస్తుంది. ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ ఇంటనాన్‌ను అనుపమ, చైనా షట్లర్ ఫాంగ్‌ను మాళవిక, రెండో సీడ్ యా హాన్ (చైనా)ను ఆకర్షి ఢీకొంటారు. మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి జంట-తైపీ జోడీ యున్ సంగ్/చీన్ యుతో తలపడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ కుమార్, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్/రుత్విక శివాని, సతీష్ కరుణాకరన్/ఆద్య, ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

2019 తర్వాత టీ20ల్లో తన ఫాస్టెస్ట్ (29 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసిన విరాట్ కోహ్లీ. అలాగే ఈ ఫార్మాట్‌లో 13 వేల రన్స్ పూర్తి చేసిన ఐదో బ్యాటర్ అయ్యాడు.

1 ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు (184) తీసిన పేసర్‌గా భువనేశ్వర్. బ్రావో (183)ను అధిగమించాడు.

2 వాంఖడేలో ఆర్‌సీబీకిది రెండో అత్యధిక స్కోరు (221/5). 2015లో 235/1 రన్స్ చేసింది.

నర్మదకు ఆరో స్థానం

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో సోమవారం భారత షూటర్లు నిరాశపర్చారు. సోమవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో నర్మద నితిన్ 166.3 పాయింట్లతో ఆరో స్థానంలో, సోనమ్ ఉత్తమ్ 124.4 పాయింట్లతో ఎనిమిది స్థానంలో నిలిచారు. జిఫి వాంగ్ (చైనా) స్వర్ణం నెగ్గగా.. యుంజీ కవ్యాన్ (కొరియా) రజతం, ఆడ్రే గొగ్నియాత్ (స్విట్జర్లాండ్) కాంస్యం దక్కించుకొన్నారు. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో నర్మద ఆరో స్థానం, సోనమ్ తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.



ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్‌గా బ్రూక్

లండన్: ఇంగ్లండ్‌క్రికెట్ పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు ఇక నుంచి హ్యారీ బ్రూక్ సారథ్యం వహించనున్నాడు. ఈ మేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అధికారిక ప్రకటన చేసింది. చాంపియన్స్ ట్రోఫీలో జట్టు పేలవ ప్రదర్శన కారణంగా జోస్ బట్లర్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈనేపథ్యంలో వైస్ కెప్టెన్‌గా ఉన్న 26 ఏళ్ల బ్రూక్‌కు వన్డే, టీ20 జట్ల పగ్గాలు అప్పగించారు. టెస్టు కెప్టెన్ స్టోక్స్‌కే పరిమిత ఓవర్ల కెప్టెన్సీని అప్పగిస్తారనే కామెంట్స్ వినిపించినా.. ఈసీబీ బ్రూక్ వైపు మొగ్గు చూపింది. 2022లో అరంగేట్రం చేసిన బ్రూక్ ఇంగ్లండ్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడుతున్నాడు.

ఇషాంత్‌కు జరిమానా

హైదరాబాద్: గుజరాత్ టైటాన్స్ పేసర్ ఇషాంత్ శర్మ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. అంతేకాకుండా ఓ డీమెరిట్ పాయింట్ కూడా అతడి ఖాతాలో చేరింది. ఆదివారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇషాంత్ ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ 2.2 రూల్‌ను అతిక్రమించినట్టు తేలింది. క్రికెట్ సామగ్రి, జెర్సీ, మైదానంలోని వస్తువులను అగౌరవపర్చడం దీనికిందికి వస్తుంది. రెఫరీ శ్రీనాథ్ విధించిన ఈ జరిమానాను ఇషాంత్ అంగీకరించాడు.

టాంజానియా చరిత్ర

తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత



న్యూఢిల్లీ: ఆఫ్రికా క్రికెట్ జట్టు టాంజానియా చరిత్ర సృష్టించింది. తొలిసారి అండర్-19 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించింది. నైజీరియాలో జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో ఆరు జట్ల రౌండ్ రాబిన్ లీగ్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ టాంజానియా విజయాలు సాధించింది. ఈ క్రమంలో 2026లో జరిగే జూనియర్ వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన 12వ జట్టుగా టాంజానియా నిలిచింది. 16 జట్ల టోర్నీలో ఆతిథ్య జట్టుగా జింబాబ్వేతోపాటు గత టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసిన 10 జట్లు నేరుగా క్వాలిఫై అయ్యాయి. ఆసియా, ఈస్ట్ ఆసియా పసిఫిక్, ఐరోపా, అమెరికా రీజియన్ల నుంచి ఒక్కో జట్టు అర్హత సాధించాల్సి ఉంది.

గుట్టుగా వ్యాధుల విస్తరణ

లక్షణాలు లేకుండా పెరుగుతున్న జబ్బులు

దీర్ఘకాల వ్యాధులతో జీవిస్తున్న లక్షలాది మంది

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బీపీ, షుగర్, ఫ్యాటీలివర్

అపోలో 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు.. పైకి ఏ లక్షణమూ కనిపించదు! లోలోపలే శరీరానికి తీరని నష్టం చేస్తుంది!! మధుమేహం.. అధికంగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం వంటి లక్షణాలున్నా చాలామంది పట్టించుకోరు!! ఈ రెండింటికీ తోడు.. ఇటీవలికాలంలో బాగా పెరుగుతున్న ఫ్యాటీ లివర్!! పరీక్ష చేస్తే కానీ బయటపడని ఈ జీవనశైలి రుగ్మతలు తమకు ఉన్నాయన్న విషయం కూడా తెలియకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాలం గడిపేస్తున్నట్టు అపోలో ఆస్పత్రి సోమవారం విడుదల చేసిన 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న అపోలో ఆస్పత్రుల్లో 25 లక్షలమందికిపైగా వ్యక్తులకు చేసిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా రూపొందించిన నివేదిక ఇది.

దేశవ్యాప్త గణాంకాలు..

దేశవ్యాప్తంగా 4.5 లక్షల మందికి బీపీ పరీక్ష చేయగా.. వారిలో 26% మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. 23% మంది మధుమేహంతో, 65 శాతం మంది ఫ్యాటీలివర్‌తో, 46 శాతం మంది అథెరోస్క్లెరోసిస్ (రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయే) సమస్యతో బాధపడుతున్నట్టు అపోలో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా.. ఫ్యాటీలివర్ బారిన పడినవారిలో 85 శాతం మందికి అసలు మద్యపానం అలవాటే లేదని.. అథెరోస్క్లెరోసిస్ బాధితుల్లో 2.5 శాతం మంది 40 ఏళ్లలోపువారే కావడం ఆందోళనకరమని నివేదిక పేర్కొంది. అలాగే.. రుతుక్రమం ఆగిపోయిన తర్వాత మహిళలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. అపోలో పరీక్షలు చేసినవారిలో మెనోపాజ్‌కు ముందు మధుమేహం బారిన పడినవారు 14% ఉంటే.. మెనోపాజ్ తర్వాత ఆ సంఖ్య 40 శాతానికి చేరిందని పేర్కొంది. బాలల్లోనూ, యువతలోనూ పెరుగుతున్న ఊబకాయంపై ఆ నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాథమిక పాఠశాలల పిల్లల్లో 8 శాతం మంది, కాలేజీ విద్యార్థులు 28 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. యువతలో 19 శాతం మందిలో ముందస్తు రక్తపోటు (ప్రీహైపర్‌టెన్షన్) సమస్య కనిపించడం. పౌష్టికాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం, యువతలో ఒత్తిడి పెరిగిపోవడం ఈ సమస్యకు కారణంగా భావిస్తున్నారు. ఇక.. దేశవ్యాప్తంగా 53 వేల మందికి నిద్ర రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు చేయగా వారిలో 24 శాతం మంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఏప్నియాతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే.. రక్తహీనత సమస్యతో 45% మంది మహిళలు, 26% మంది పురుషులు బాధపడుతుండగా.. విటమిన్ డి లోపం స్త్రీ, పురుషుల్లో వరుసగా 77%, 82 శాతంగా ఉంది. విటమిన్ బి12 లోపం 38 శాతం మంది పురుషులు, 27 శాతం మంది మహిళల్లో ఉన్నట్టు తేలింది. 40 ఏళ్లలోపు వారిలో ఈ లోపం మరింత స్పష్టంగా కనిపించింది. బి12 లోపం ఉన్నవారు వైద్యులను సంప్రదించి, దాన్ని సరిచేసుకోకపోతే.. పలు ఆరోగ్యసమస్యల బారినపడే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. అదే సమయంలో.. ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుని అనారోగ్య సమస్యలను గుర్తించి, వైద్యుల సలహా సూచనలను పాటించిన 59 శాతం మందిలో హెచ్‌బీఏ1సీ (గడిచిన 2-3 నెలల సగటు షుగర్ లెవల్స్) స్థాయిలు తగ్గాయని, 51 శాతం మందికి అధిక రక్తపోటు స్థాయిలు తగ్గాయని నివేదికలో తేలింది.

ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై దృష్టిపెట్టాలి

బీపీ, షుగర్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలున్నా.. వాటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది వైద్యపరీక్షలు చేయించుకోవట్లేదని, అలా కాకుండా ముందుగా పరీక్షలు చేయించుకుంటే వీటిలో చాలా జబ్బులు వచ్చే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని నివేదిక సూచించింది. నివేదికలోని అంశాలపై అపోలో ఆస్పత్రుల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్ అంటే భవిష్యత్‌లో నిర్ణయం తీసుకునే అంశం కాదని, ప్రస్తుతం దేశ శ్రేయస్సుకు అదే మూలస్తంభం అని ఆయన అభిప్రాయపడ్డారు. మద్యం సేవించకపోయినా ఫ్యాటీ లివర్ వ్యాధి రావడం.. కొత్త రోగనిర్ధారణ పరీక్షల అవసరాన్ని తెలియజేస్తోందని, సంప్రదాయ స్క్రీనింగ్ పరీక్షలు ఇక ఎంతమాత్రం సరిపోవని అపోలో ఆస్పత్రుల ఎండీ సునీతా రెడ్డి అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

శక్తిమంతమైన లుక్‌లో...



అశ్విన్‌బాబు హీరోగా ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అభినయ, రియా సుమన్, ఆయేషా ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి అశ్విన్‌బాబు లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో ఆయన పాత్ర శక్తిమంతంగా ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ యాక్షన్ మిస్టరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఎం.ఆర్.వర్మ, డీఓపీ: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌరహరి.

గోదారి అందాల నడుమ..



విక్టరీ వెంకటేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో 'గోదారి గట్టుపైన' పాట ఎంత పాపులర్ అయిందో చెప్పనక్కర్లేదు. ఆ పాటలోని మొదటి పదాన్ని తమ సినిమాకు టైటిల్‌గా నిర్ణయించింది రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ. 'గోదారి గట్టుపైన' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. సుభాష్‌చంద్ర దర్శకుడు. నిధి ప్రదీప్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ఒక చల్లని సాయంత్రం వేళ ప్రశాంతమైన గోదావరి ఒడ్డున మీ స్నేహితులతో కూర్చుని సమయం గడపడం ఎంత ప్రశాంతంగా ఉంటుందో.. మా సినిమా కూడా అంతే ప్రశాంతంగా ఉంటుంది. అందమైన భావోద్వేగాలతో ఉంటుంది. గోదావరి జిల్లాలు వేల్పూరు, రేలంగి, భీమవరం నేపథ్యంలో రూపుదిద్దుకుంటోంది. పశ్చిమ గోదావరి ప్రాంతంలోని సుందరమైన ప్రకృతి దృశ్యాలు ప్రేక్షకులకు కనువిందు చేస్తాయి' అని దర్శకుడు చెప్పారు. రాజీవ్ కనకాల, లైలా, దేవీ ప్రసాద్, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అభినవ్ రావు ఈ చిత్రానికి నిర్మాత.


ముచ్చటగా బంధాలే!



విజయశాంతి, కల్యాణ్‌రామ్ తల్లీకొడుకులుగా నటిస్తున్న 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రం ఈ నెల 18న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో వీరిద్దరి పాత్రలు చాలా కీలకం. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ సింగిల్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. సెకండ్ సింగిల్ 'ముచ్చటగా బంధాలే' ను బుధవారం చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో విడుదల చేయనున్నారు. తల్లీకొడుకుల అనుబంధాన్ని అద్భుతంగా వివరించే పాట ఇది. ఇటీవలె సినిమా ప్రమోషన్స్ ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా చేసిన స్పెషల్ ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని అందించారు. రామ్‌ప్రసాద్ ఛాయాగ్రాహకుడు.



షారుఖ్‌తో మళ్లీ..



షారుఖ్ ఖాన్ కొత్త చిత్రం 'కింగ్' గురించి వినిపిస్తున్న ఒక కొత్త వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. షారుఖ్, ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రలు పోషించే ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రను దీపిక పదుకోన్ పోషించనున్నారట. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా.. సుహానాకు ఆమెకు తల్లిగా నటించడం ప్రత్యేకతేగా మరి. షారుఖ్, దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఆ పాత్ర ప్రాధాన్యం గురించి దీపికకు చెప్పి ఆమెను ఒప్పించారట. షారుఖ్ చిత్రంలో దీపిక మళ్లీ నటిస్తున్నందుకు ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు కానీ ఇందులో ఆమెది తల్లి పాత్ర అని తెలియగానే నీరస పడిపోతున్నారు. ఎందుకంటే.. 'దీపికకు 39 ఏళ్లు, సుహానాకు 24 ఏళ్లు. వీరిద్దరికి పదిహేనేళ్ల ఏజ్ గ్యాపే ఉంది కనుక తల్లీకూతుళ్లుగా కంటే అక్కా చెల్లెళ్లుగా చూపిస్తే బాగుంటుంది.. ఆలోచించండి ఖాన్ సాబ్' అని అభిమానులు అభ్యర్థిస్తున్నారట.

ఎక్స్‌లోకి రీ ఎంట్రీ

నటి సమంత సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చారు. ఈ సందర్భంగా తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' టీజర్‌ను అభిమానులతో పంచుకున్నారు. 'పెద్ద కలలతో మా టీమ్ చేసిన చిన్ని ప్రయత్నమిది.. ఎంతో ప్రేమతో చేసిన ఈ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రీగుల దర్శకత్వం వహించిన ఈ చిత్ర టీజర్ ఇటీవలే విడుదలైంది. త్వరలోనే రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా, 2012లో ఎక్స్(అప్పట్లో ట్విట్టర్) ఖాతాను ప్రారంభించారు సమంత. ఇటీవలె అందులో పెట్టిన అన్ని పోస్టులను తొలగించారు. అప్పటినుంచి ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్ వ్యక్తిగత విషయాలు, ఫొటోలు షేర్ చేస్తున్నారు. ఇప్పుడీ చిత్రాన్ని ప్రమోట్ చేయడానికి ఆమె ఎక్స్ ఖాతాను తిరిగి ఉపయోగించడంతో నెటిజన్లు ఖుషీ అవుతున్నారు. ఆమెను స్వాగతిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఏకే వస్తున్నాడు..



తమిళ హీరో అజిత్‌కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. త్రిష కృష్ణన్ కథానాయికగా నటించారు. షాయాజీ షిండే, జాకీ ష్రాఫ్, ప్రభు, సునీల్, అర్జున్‌దాస్, సిమ్రాన్, ప్రియాప్రకాశ్ వారియర్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 10న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నువ్వు పెద్ద విలన్‌వని విన్నా.. కానీ నా గేమ్‌లో నేనేరా నీకు విలన్', 'ఏకే వస్తున్నాడు దారివదలండ్రా', 'వాడు భయాన్ని భయపెట్టేవాడు' వంటి సంభాషణలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి.

రెండో సారి క్యాన్సర్... భార్యకు ధైర్యం చెప్పిన హీరో



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా సతీమణి, నటి, దర్శకురాలు తహీరా కశ్యప్ రెండోసారి క్యాన్సర్ బారిన పడ్డారు. తనకు తిరిగి రొమ్ము క్యాన్సర్ సోకినట్టు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఎటువంటి అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళ్లాలని తహీరా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తహీరా తన రొమ్ము క్యాన్సర్ విషయం వెల్లడించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని కోరారు. భార్య పెట్టిన పోస్ట్‌కు వెంటనే స్పందిస్తూ 'మై హీరో' అని కామెంట్ పెట్టారు. 2018 లో ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఇక అప్పటినుంచి చికిత్సలో భాగంగా జరిగే ప్రతి చర్యనీ ఆమె సోషల్ మీడియాలో పంచుకుంటూ తనలా క్యాన్సర్‌తో బాధ పడేవారికి ధైర్యాన్ని ఇచ్చారు.

ఉత్తమ ప్రదర్శనగా 'నాన్నా నేనొచ్చేస్తా'

ముగిసిన పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని వేదికపై మూడు రోజులపాటు పది నాటికలు ప్రదర్శితమయ్యాయి. ఈ



'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక బృందానికి ఉత్తమ ప్రదర్శన అవార్డును అందజేస్తున్న తెలంగాణకు చెందిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

నాటిక పోటీలకు వివిధ రంగాలకు చెందిన 15మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా అమృతలహరి థియేటర్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక నిలిచింది. వాస్తవ కథనంతో భావోద్వేగ భరితమైన నటనతో ఇటు న్యాయనిర్ణేతలను అటు ప్రేక్షకుల మనసుల్ని ఆకట్టుకున్న ఈ నాటికకు ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటీనటులు బహుమతులు కూడా లభించాయి.

ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా 'నా శత్రువు'

ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా జయభేరి ఆర్ట్స్, హైదరాబాద్‌వారు ప్రదర్శించిన 'నా శత్రువు' నాటిక నిలిచింది. ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ సహాయ నటి బహుమతులు కూడా ఈ నాటికకు దక్కాయి. ఉత్తమ తృతీయ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్, కొలకలూరు వారు ప్రదర్శించిన 'జనరల్ భోగీలు' నాటిక ఎంపిక కాగా, ఉత్తమ నటీనటులకు వ్యక్తిగత బహుమతులు లభించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్రం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ విజేతలకు బహుమతులు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.17,21,419 లక్షలు జమ

ముందుకొచ్చిన ఎంప్లాయిస్ సొసైటీ సంఘం డెయిరీ సభ్యులు

తెనాలిరూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు వరంలా ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్‌కు మేము సైతం అంటూ గుంటూరు జిల్లా ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ సంఘం డెయిరీ సభ్యులు రూ. 17,21,419 లక్షలు జమచేశారు. 1982లో స్థాపించిన సొసైటీ అంచలంచెలుగా ఎదిగి 829మంది సభ్యులను నెలకొల్పింది. ఈ సభ్యులకు అత్యవసరమైతే వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తూ వాటిపై వచ్చిన ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా సభ్యులందరూ కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ అకౌంట్‌కు జమచేశారు. ఈ సందర్భంగా సభ్యులు కొత్తరమేష్‌బాబు మాట్లాడుతూ ఎందరో కష్టాల్లో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. తమ సొసైటీ సభ్యులందరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలన్న ఉద్దేశంతో వడ్లమూడి కెనరాబ్యాంక్ నుంచి సీఎం సహాయనిధికి రూ. 17,21,419 లక్షలు జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి చంద్రశేఖర్, చిగురుపాటి శ్రీనివాసరావు, వాసిరెడ్డి జయదత్తు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగావకాశాలు

➡ ప్రముఖ కూల్ డ్రింక్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం : 15,000 + 3వేలు, అర్హత : డిగ్రీ, సంప్రః 9121469383.
AJG-210610

➡ ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, నరసరావుపేట, తెనాలి, మంగళగిరి, సత్తెనపల్లి, పేరేచర్ల, పిడుగురాళ్ళ, చేబ్రోలు, పొన్నూరు, బాపట్ల, వినుకొండ ప్రాంతాల్లో JS Pride కంపెనీ గోలి సోడా బిజినెస్ చేసుకొనే డీలర్లు కావలెను. నెలకు 50 వేలు నుండి లక్ష వరకు సంపాదన. సంప్రదించండి : 93811 50982.
AJG-210549

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-209349

EDUCATION

➡ BPT, BSc., (MLT) సీట్లు : విజయవాడలోని ప్రముఖ కాలేజిలో 2024-25 సం.కి BPT, BSc., (MLT) మేనేజిమెంట్ సీట్లు కలవు. సంప్రదించండి : Principal 80082 80062.
AJT-1112

రియల్ ఎస్టేట్

➡ శ్రీకృష్ణ బృందావనం ! ఫామ్ హౌస్ లాండ్ గుంటూరు నుండి బోయపాలెం మీదుగా కొండవీడు 25 కి.మీ. పర్యటక ప్రాంతం సమీపంలో ⓔ సెంటు - లక్ష రూపాయలు, 14 సెంట్లు, 10 సెంట్లు బిట్స్ కలవు, తోట పని ఉన్నది, పక్కా రిజిస్ట్రేషన్. సంప్రః 9381449563.
AJG-210545

స్థలం అమ్మకము

➡ వట్టి చెరుకూరు గ్రామంలో గ్యాస్ కంపెనీ రోడ్డు మరియు టెలిఫోన్ ఎక్ఛేంజికి సమీపములో ఉన్న 586 చ.గః స్థలం అమ్మబడును. రెండువైపులా రోడ్డు కలదు. సంప్రః 8500450775
AJG-204394

FLAT FOR SALE

➡ గుంటూరు యనమదల దగ్గర 1050 Sq.F first floor 2 Bed Rooms, వెంకటేశ్వర అపార్ట్‌మెంట్ నందు 22 లక్షలు, నెలకు 8000 అద్దె వచ్చే ఫ్లాట్ అమ్మబడును. సంప్రః 96032 79011.
AJG-210702

అద్దెకు


➡ గుంటూరు, ఇండిపెండెంట్ ఇల్లు 2nd ఫ్లోర్ 2BHK నగరాలు టెలికాంనగర్, 3వ లైన్ చైతన్య స్కూల్ వెనుక అద్దెకు కలదు. సంప్రః 98499 11625.
AJG-210544

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్ - 97036 18725
గుంటూరు 2 టౌన్ - 99854 01056
తెనాలి - 99854 11202
నరసరావుపేట - 99854 11206
బాపట్ల - 99663 35084
పిడుగురాళ్ళ - 93909 05725
మంగళగిరి - 93986 73618
అమరావతి - 95027 86195
పొన్నూరు - 97042 99094
రేపల్లె - 99854 12254
చిలకలూరిపేట - 98852 71281
వినుకొండ - 99662 50266
మాచర్ల - 88861 19952
సత్తెనపల్లి - 91103 23914
ప్రత్తిపాడు - 63004 34285
సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

త్వరలో డాక్టర్ పోస్టుల భర్తీ

వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ జనార్ధన్

వినుకొండటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 173 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు వైద్యవిధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్ధన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను కాయకల్ప కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సందర్శించారు. వైద్యశాలను పరిశీలించి పలు విభాగాల వైద్యులకు సూచనలు, సలహాలు అందించారు. బాల్య వివాహాల ద్వారా చిన్నవయసులోనే గర్భవతులు అవుతున్నారని, టీనేజీ మ్యారేజీలను తగ్గించాలని, ఫ్యామిలీ ప్లానింగ్‌పై చైతన్యం కల్పించాలని తెలిపారు. 19 సంవత్సరాల వరకు గర్భవతి కాకూడదని, దీనికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఛాయ టాబ్లెట్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులకు సిజేరియన్ల ద్వారా కాన్పులు చేయడం తగ్గించాలని, దీని ద్వారా పుట్టే పిల్లలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ లైఫ్ స్టైల్ ద్వారా తమ ఆరోగ్య సమస్యలను మెరుగుపరచుకోవచ్చని, చిరుధాన్యాలను అధికంగా తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో గుండెపోట్లు అధికంగా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జనార్ధన్, డాక్టర్ సురేష్‌చంద్ర

నమోదవుతున్నాయని తెలిపారు. త్వరలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చొరవతో ట్రామ కేర్ వైద్యశాలతో పాటు డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారి సురేష్‌చంద్ర, డాక్టర్ రాంప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ రజాక్, డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, బాలునాయక్, సుధాస్రవంతి, హారిక, వెంకటేష్, సుధాకర్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతల స్వీకారం



డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీఆర్‌ఎం సైమన్

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా సుధేష్ణ సేన్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వచ్చిన ఆమె పూర్వ డీఆర్‌ఎం ఎం రామకృష్ణ నుంచి ఛార్జ్ తీసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు రైల్వే అధికారులు, యూనియన్ల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సుధేష్ణ సేన్ 1996 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసు అధికారిణి. ఆమె గతంలో న్యూఢిల్లీలోని నార్తర్న్ రైల్వేలో ఆర్థిక సలహాదారుగా, చీఫ్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహించారు. ఆర్థిక నిర్వహణ, పరిపాలన విధానంలో విశిష్టమైన కెరీర్‌ని ఆమె నిర్మించుకున్నారు. రైల్వే ఫైనాన్స్‌లో తన వ్యూహాత్మక దృష్టి, నాయకత్వంతో ఖ్యాతిని సంపాదించి పెట్టారు. ఆర్థిక శాస్త్రంలో అండర్ గ్రాడ్యూయేట్ డిగ్రీ, పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసి తొలుత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అలానే రైల్వేలో చేరిన తర్వాత తర్వా సెంట్రల్ రైల్వేస్ ముంబైలో, భోపాల్, జబల్‌పూర్, సౌత్ ఈస్టర్న్ రైల్వే కోల్‌కతాలోని వెస్టు సెంట్రల్ రైల్వేలోనూ బాధ్యతలు నిర్వహించారు. ముందుకు సాగుతుండండి... నేర్చుకొంటూ ఉండండి అన్న సిద్ధాంతాన్ని సుధేష్ణ సేన్ ఎక్కువగా నమ్ముతారు. ట్రెక్కింగ్, దూర ప్రాంతాలకు ప్రయాణం, సంగీతాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తారు. డీఆర్‌ఎంని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసిన వారిలో ఏడీఆర్‌ఎం కే సైమన్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టుల మేనేజర్ మనోహర్‌రెడ్డి, వివిధ విభాగాల సీనియర్ అధికారులు జేవీ అనూష, ప్రదీప్‌కుమార్, షాబాజ్ హనూర్, కమలాకర్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రధాని సభకు ప్రత్యేకాధికారిగా వీరపాండ్యన్

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరగనున్న ప్రధాన మంత్రి సభకు ప్రత్యేక అధికారిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రభుత్వం చేపట్టబోతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో పీఎంఓ నుంచి ఆమోదం కూడా లభించింది. ఈ నెల 23వ తేదీ తరువాత ప్రధాని రాజధాని అమరావతికి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలు స్తోంది. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక అధికారి జీ వీరపాండ్యన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. సభ ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఆయన రాజధాని పరిధిలోని వెలగపూడిలో పర్యటించారు. ప్రస్తుత సచివాలయానికి వెనుక భాగంలో 250 ఎకరాల్లో ప్రధాని సభకు ఏర్పాట్లు చేయనున్నారు. ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గుంటూరుజిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏర్పాట్ల గురించి వారితో చర్చించారు. కాగా ప్రధాని పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో సభ నిర్వహణా కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఉన్నతాధికారులకు పలు రకాల బాధ్యతలను అప్పగిస్తోంది.

వ్యక్తిగత గొడవల నేపథ్యంలో యువకుడి హత్య

● 24 గంటల్లోపే నిందితుల అరెస్టు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత గొడవలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ యువకుడిని కత్తితో దారుణంగా హత్య చేసిన సంఘటన తాడేపల్లిలో సోమవారం ఉదయం జరిగింది. సీఐ కళ్యాణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఇట్టా వర్ధన్ (22)ను హత్య చేసిన తొత్తుక భరత్ అలియాస్ బంటి మరికొందరు ఇటీవల జరిగిన కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. అక్కడ వస్తువులు, దుస్తులు పోయాయని ఒకరినొకరు దూషించుకోవడంతో వర్ధన్, భరత్‌లకు మధ్య ఘర్షణ జరిగింది. తీవ్రంగా కొట్టుకున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. అక్కడ గొడవలు, పాత ఆర్థిక



నిందితుల వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో సీఐ, ఎస్‌ఐ

లావాదేవీల నేపథ్యంలో కక్ష పెంచుకున్న భరత్ మరో వ్యక్తి కలిసి స్థానిక పట్టాభి రామయ్య కాలనీలోని మృతుడి నివాసంలోనే తెల్లవారు జామున 1.30 గంటల సమయంలో కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వర్ధన్ తీవ్రంగా గాయ పడ్డాడు. కుటుంబసభ్యులు కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. చికిత్స నిమి త్తం 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందినట్టు ప్రభుత్వాస్ప త్రి వైద్యులు నిర్ధారించినట్టు సీఐ కళ్యాణరాజు తెలిపారు. మృతుడి అక్క రుద్రవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. జరిగిన ఘటనపై మృతుడి అక్క రుద్రవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ కేసులో నిందితులైన తొత్తుక భరత్ అలియాస్ బంటి, ఇసుకపల్లి ప్రకాష్‌లను సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసినట్లు నార్తు జోన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. 24 గంటల్లోపే కేసును ఛేదించిన సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్‌ఐలను ఉన్నతాధికారులు అభినందించారు.

చకచకా రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు

● వైసీపీ ప్రభుత్వంలో చెప్పులరిగేలా తిరిగినా కాని రిజిస్ట్రేషన్లు
● కూటమి పాలనలో 87 శాతం పూర్తి

తుళ్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతమైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ-లాటరీ పద్ధతిలో స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు ప్లాట్ల కేటాయింపును ప్రారంభించారు. ఆ తరువాత అధికారులు గ్రామాల వారీగా కేటాయింపులు చేశారు.



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రైతులు

వాణిజ్య, నివాస ప్లాట్లు కలిపి రాజధాని 29 గ్రామాలకు చెందిన రైతులకు 68 వేల ప్లాట్ల కేటాయించారు. ఆ సమయంలోనే 50 శాతం రిజిస్ట్రేషన్‌లు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయండని ఎంత అడిగినా కానీ నెలకు ఒకటి రెండు ప్లాట్ల కన్నా చేయలేదు. అది కూడా లంచాలు తీసుకొని ఒకటికి పది సార్లు రైతులను కార్యాలయాలు చుట్టూ తిప్పి చేశారనే ఆరోపణలున్నాయి. తిరిగి చంద్రబాబునాయుడు అధికారంలోకి రావటంతో అమరావతి అభివృ ద్ధిపై దృష్టి పెట్టడంతో అధికార యంత్రాంగం కదిలింది. గత టీడీపీ ప్రభుత్వంలో అనంతవరం, తుళ్లూరు, మందడం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలే కాక ఇప్పుడు ల్యాండు పూలింగ్ యూనిట్ ఆఫీసుకు ఒకటి చొప్పున 9 చోట్ల రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటి వరకు 87 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగిలి ఉన్నవి కూడా త్వరగా పూర్తి చేయాలని సీఆర్డీఏ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

అసభ్యకర పోస్టులు.. ముగ్గురిపై కేసు నమోదు

చిలకలూరిపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, వారి కుటుంబ సభ్యులపైన సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన ముగ్గురిపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో మానుకొండ శ్రీకాంత్ రెడ్డి (మానుకొండవారిపాలెం), దొడ్డా రాకేష్ గాంధీ (చిలకలూరిపేట), కందుల శ్రీకాంత్ (చిలకలూరిపేట) ఉన్నారని చిలకలూ రిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు సోమవారం చెప్పారు. చిలకలూ రిపేట మండలం గొట్టిపాడుకు చెందిన ఎం శివ కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచవరం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోను ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పొన్నూరు రూరల్ ఎస్‌ఐ గండు కిరణ్ కథనం ప్రకారం రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో సోదాలు నిర్వహిస్తుండగా ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి కేసు నమోదు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గాలి దుమారం

● మోస్తరుగా వర్షం
● తాడికొండ, మంగళగిరి, తుళ్లూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎండ మండిపోగా సాయంత్రం 6 గంటల సమయం దాటిన తర్వాత జిల్లాలోని కొన్ని మండలాల్లో గాలి దుమారం రేకెత్తించింది. సోమవారం సాయంత్రం ఆకాశంలో దట్టమైన కారుమబ్బులు కమ్ముకొని భారీ వర్షం కురుస్తుందేమోనన్న వాతావరణాన్ని తలపించింది. అయితే గాలి బలంగా వీచడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఊడి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడటంతో పలు మండలాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 6.30 గంటలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా రాత్రి 8.30 గంటల వరకు కూడా పునరుద్ధరణ జరగలేదు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా చాలా చోట్ల రాత్రి 8 గంటల లోపే విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, కొన్ని చోట్ల మాత్రం రాత్రి 9 గంటలకు సప్లై ఇస్తామన్నారు. గాలి కారణంగా దుమ్ము, ధూళి ఎగిసిపడుతూ రోడ్లపై పాదచారులు, ద్విచక్ర వాహనదారుల కళ్లల్లోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలి దుమారం మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, తాడికొండ, గుంటూరు నగరం, పెదకాకాని, వట్టిచెరుకూరులోనే ఎక్కువగా ప్రభావం చూపించింది. తెనాలి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి గాలి/వర్షం కురవలేదు. వర్షం రాక ముందు ఆకాశంలో మెరుపులు మెరిశాయి. కొన్ని గ్రామాల్లో ఉరుములు ఉరిమాయి. భారీ వర్షం తప్పదనుకున్న తరుణంలో గాలి కారణంగా వర్షం వెలిసిపోయింది. బలమైన ఈదురుగాలులు వీధి వ్యాపారులకు నష్టం కలిగించాయి. ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్ల కేబుల్స్ ఎక్కడికక్కడ తెగిపోయాయి. దీంతో కొన్ని చోట్ల ఇంటర్నెట్ సేవలకు ఆటంకం ఏర్పడింది.



గుంటూరు నగరంలో ఆకాశంలో మెరుస్తున్న మెరుపులు

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా జిల్లా జడ్జి పార్ధసారథి

● గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కల్యాణ చక్రవర్తి



కల్యాణ చక్రవర్తి

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న వైవీఎస్‌బీజీ పార్ధసారథిని రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా బదిలీ చేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న బీ సాయి కల్యాణ చక్రవర్తిని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమించింది. రాష్ట్రంలోని వివిధ కోర్టులో పనిచేస్తూ ఆ ప్రాంతంలో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పలువురు జిల్లా జడ్జిలను మరో చోటికి బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పని చేస్తున్న డి. తిరుమలరావును శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపేటలో గల ఐదవ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేసింది. ఖాళీ అయిన ఆయన స్థానంలో ప్రస్తుతం ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తున్న డి. రాములును నియమించింది. గుంటూరు ఫోక్సో కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేస్తున్న ఏ అనితను విజయవాడలోని ప్రజా ప్రతినిధుల నేరాల విచారణ స్పెషల్ కోర్టుకు బదిలీ చేసింది. ఖాళీ అయిన ఆమె స్థానంలో ప్రస్తుతం నెల్లూరులోని 7వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న షమీ పర్వీన్ సుల్తానా బేగంను నియమించారు. ప్రస్తుతం విజయవాడలోని ఏసీబీ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న బి.సత్య వెంకట హిమబిందును రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీగా బదిలీ చేశారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

గా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో ఇలాంటి ఆటలు పోటీలు నిర్వహించడం చాలా శుభ పరిణామమని.. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది నిర్వహించాలన్నారు. తద్వారా ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి మనస్పర్థలు లేకుండా పనిచేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఎప్పుడూ కార్యాలయంలోనే కూర్చొని పనిచేస్తున్న ఉద్యోగులకు ఇలాంటి ఆట పోటీలతో శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ ఇన్చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్న షీలామణి, రిజిస్టర్ ఆచార్య జీ సింహచలం, యూనివర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

సత్తెనపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని క్రిష్టియన్‌పేటకు చెందిన మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్ కుమార్ కుమార్తె సాహితీ సంజన(19) సోమవారం తన పిన్ని గృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సాహితీ సంజన శ్రీకాకుళం జిల్లాలో ఏజీబీఎస్సీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. విద్యార్థిని తండ్రి సురేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సురేష్ కుమార్ టీడీపీ క్రియాశీలక నేత కావటంతో వివిధ పార్టీల నేతలు సంజన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎరువుల వ్యాపారి అదృశ్యం?

◆ రూ. 2.50 కోట్ల అప్పులు ◆ రూ. 60 లక్షలకు రైతులకు అగ్రిమెంట్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లిగ్రామానికి చెందిన ఎరువుల వ్యాపారి రూ. 2.50 కోట్ల మేర అప్పులు చేసి పరారైనట్లు విశ్వసనీయ సమాచారం. ఎరువుల వ్యాపారి తాళ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 100 మంది రైతుల వద్ద పంట, నగదు రూపేణా సుమారు రూ. 2.50 కోట్ల మేర అప్పులు చేశారు. తనకున్న పొలాలు, స్థలాలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని రైతులను కోరి ఈ మేరకు అగ్రిమెంట్ కూడా రాసినట్లు తెలుస్తోంది. ఈ ఆస్థుల విలువ సుమారు రూ. 60 లక్షల దాకా ఉన్నట్లు సమా



రెవెన్యూ కార్యాలయం వద్ద అప్పులిచ్చిన రైతులు

చారం. సోమవారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఆ వ్యాపారి ఇంటికి తాళాలు వేసి కనిపించకుండా పోయాడని అప్పులిచ్చిన రైతులు ఆందో ళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు సోమవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్‌కు, రూరల్ సీఐ నఫీజ్‌బాషాకు వినతిపత్రం అందించారు.

సాగర్ ప్రాజెక్టు నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 516.30 అడుగులు ఉంది. ఇది 142.61 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 2053 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4881 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 8734 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,37,288 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,53,787 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,37,288 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 64,276 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13400
273	10000	12900
341	10500	14000
4884	10000	11900
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10300	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10500	12400
బ్యాడిగి 355	10000	13300
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10300	12700
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6300

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి: 99854 11225 | 99854 01330 | 99854 01690 | 99854 77867

ఉరుములు, మెరుపులతో కూడిన గాలి.. వాన

● తీవ్రంగా నష్టపోయిన మిరప రైతులు ● గాడాంధకారంలో దాచేపల్లి

దాచేపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉరుములు, మెరుపులు, గాలి, వడగళ్ళతో కూడిన వర్షం కురవటంతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఒకసారిగా ఈదురుగాలులు వీచి వడగళ్ళతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా వాన కురవటంతో పాదాచారులు, ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు దుమ్ముతో కూడిన గాలికి చెల్లాచెదురు కాగా కొన్ని కాయలు వానకు తడిచాయి. పట్టలు కప్పుతున్న రైతులపై వడగళ్ళు పడటంతో రైతులు కూడా ప్రాణభయంతో పరుగులు తీశారు. ఉరుములు, మెరుపులతో వర్షంపడటంతో జనజీవనం స్తంభించింది. ప్రధానంగా దాచేపల్లి, ముత్యాలంపాడు, తంగెడ, మాదినపాడు, కేసానుపల్లి, గామాలపాడు, పెద గార్లపాడు గ్రామాలకు చెందిన రైతులు అకాలవర్షంతో మిరపపంటలను నష్టపోయారు. అదేవిధంగా కోతకు వచ్చిన మొక్కజొన్న, పొగాకు రైతులు కూడా నష్ట పోయారు. తీవ్రమైన గాలులతో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది. దాచేపల్లి మండలంలో ఉన్న నడికూడి, శ్రీనగర్, పెదగార్లపాడు, మాదినపాడు గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో విద్యుత్‌ను నిలిపివేశారు. మండలం మొత్తం అంధకారంతో నిండిపోయింది.

బెల్లంకొండలో భారీ వర్షం

బెల్లంకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో సోమవారం సాయంత్రం భారీవర్షం పడింది. ఒక్కసారిగా ఈదురు గాలులతో భారీ వర్షం రావటంతో కల్లాల్లో ఉన్న మిర్చిని పోగు చేసుకొనేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో మిర్చి తడిచిపోవటంతో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన మిర్చి ఈదురుగాలులకు రాలిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. కందిపంట కుప్పవేసి ఉందని, తడిస్తే దిగుబడి తగ్గి రేటు తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షం.. ఆందోళనలో రైతులు

పెదకూరపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి రైతులు ఆందోళన చెందారు. అకాల వర్షంతో రైతులు కల్లాల వైపు పరుగులు తీసి మిర్చిపై పట్టలను కప్పారు. ఈదరుగాలుల వల్ల విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగింది. పలు చోట్ల అరటి పంటలు నేలకొరిగాయి.

ఈదురు గాలులు.. కరెంట్ కట్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఒక్కసారిగా అరగంటపాటు పట్టణంలో ఈదురుగాలులు ఉధృతంగా వీచాయి. దీంతో కరెంటు సరఫరా నిలిపివేశారు. రోడ్ల వెంట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు చిరు వ్యాపారులు, తోపుడు బండ్లపై వాలిపోయాయి. దీంతో చిరు వ్యాపారులు భయాందోళన చెందారు. కరెంటు పోవడంతో పట్టణంలో చీకటి అలముకుంది.

ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపుపై రాయితీ

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులు నెలాఖరులోపు చెల్లించేవారికి మొత్తం పన్నుపై 5శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆస్తిపన్ను ఈ నెల 30వ తేదీలోపు చెల్లించినవారికి ఆస్తిపన్నులో రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని కమిషనర్ తెలిపారు. ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్నుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సెలవు దినాలలో కూడా పన్ను చెల్లించుకోవచ్చునని కమిషనర్ తెలిపారు.

సత్తెనపల్లిలో ఐదు శాతం రాయితీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్ను చెల్లింపుదారులకు ఐదు శాతం రాయితీ అవకాశం ఉందని మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఇంటి పన్నులు, ఖాళీస్థలాలు, నీటి పన్నులు ఈనెల 30వ తేదీ లోపు చెల్లించిన వారికి ఈ రిబేట్ ఉంటుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పశు బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలి

సత్తెనపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ప్రాంతంలోని పశు పోషకులు పశు బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలని పశు సంవర్ధకశాఖ అధికారి ఎం.నాగేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పథకం ద్వారా రైతులు తమ పశువులకు, గొర్రెలకు, మేకలకు బీమా చేయించుకోవాలని సూచించారు. ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా పది పశువుల వరకు బీమా చేయవచ్చన్నారు. ఒకేసారి బీమా చేస్తే మూడు సంవత్సరాల వరకు వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ సబ్సిడీ నాటు పశువులకు రూ.816, మేలు జాతి పశువులకు రూ.1632 వర్తిస్తుందన్నారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు

ఆరోగ్యమే మహాభాగ్యం

సత్తెనపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ విజయకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన అవసరమన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, కేబీఆర్‌జే ప్రసాదు, సుభానీ, శివశంకర్, చంద్రయ్య, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా..

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బాధితులకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామంలో శనివారం రాత్రి బొక్కా లింగారావుకు చెందిన ఇల్లు షార్ట్‌సర్క్యూట్ వల్ల కాలిపోయింది. సామాగ్రి, రూ.57వేల నగదు ఆహుతయ్యాయి. ఎమ్మెల్యే కన్నా సోమవారం లింగారావు ఇంటిని పరిశీలించి వారికి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. లింగారావు కుటుంబసభ్యులకు అండగా ఉంటానని కన్నా తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వయ్యారిభామ మొక్కలను నిర్మూలించాలి

నకరికల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో, గట్లపైన, రోడ్డు పక్కన వయ్యారిభామ మొక్కలను నిర్మూలించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ నాన్సీ జాస్మిన్ తెలిపారు. సోమవారం నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వయ్యారి భామ మొక్కలను నిర్మూలించాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పొలాల్లో ఆ మొక్కలను రైతులకు చూపి వాటిని తొలగించారు. ఆ మొక్కల వల్ల కలిగే నష్టాలను రైతులకు వారు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జీ విజయకుమార్ పాల్గొన్నారు.



వయ్యారిభామ మొక్కల వల్ల నష్టాలను రైతులకు వివరిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

డెడ్‌స్టోరేజ్‌లో బుగ్గవాగు రిజర్వాయర్



బుగ్గవాగు రిజర్వాయర్

● ఏప్రిల్ 20 వరకు సాగునీటిని విడుదల చేయాలని రైతుల వినతి

రెంటచింతల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): లక్షలాది ఎకరాలకు సాగు నీరందించే బుగ్గవాగు రిజర్వాయర్‌లో నీరు డెడ్‌స్టోరేజ్‌కు చేరింది. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. గత కొద్దిరోజుల నుంచి మల్లవరం మేజర్‌కు పూర్తిస్థాయిలో నీరు విడుదల కాక ఆందోళన వ్యక్తమౌతున్న తరుణంలో ఉన్న కొద్దిపాటి నీరు పొలాలకు అందుతుందో లేదో నని రైతులు ఆందోళన చెందుతున్నారు.

'చి'వరి' తడులు అందక..

మండలంలోని మల్లవరం, గన్నవరం మేజర్‌కు పూర్తి స్థాయిలో నీరు రాకపోవడంతో పైర్లు ఎండుముఖం పట్టాయి. ఏప్రిల్ 20 వరకు నీటిని విడుదల చేస్తే కొంత ప్రయోజనం ఉంటుంది. చివరి దశలో వున్న వరికి నీళ్ల అందకపోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. అప్పులే మిగులుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌కున్న 22 గేట్లు తుప్పుపట్టడంతో పాటు సాగర్ కెనాల్ మీద 801మంది లస్కర్లకు 72మంది మాత్రమే ఉండడం సమస్యకు ప్రధాన కారణం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఏప్రిల్ 20 వరకు సాగునీటిని విడుదల చేసేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సహకరించండి

● రూ.4.10 కోట్ల నిధులకు గ్రీన్ సిగ్నల్
● శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్‌తో ఎమ్మెల్యే జూలకంటి భేటి

మాచర్లటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గ పరిధిలోని చెంచు, ఎరుకలు, యానాది, సంచార, సుగాలి తదితర గిరిజనుల అభివృద్ధికి సహకరించాలని ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్ట్ పీవో వెంకటశివప్రసాద్‌ను సోమవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శ్రీశైలంలోని సుండిపెంట ఐటీడీఏ ప్రాజెక్ట్ కార్యాలయంలో పీవోను కలిసి నియోజకవర్గంలో గిరిజనుల సమస్యలను విన్నవించారు. గిరిజనుల అభ్యున్నతికి పక్కా గృహాలు, తాగునీరు, విద్యాలయాలు, హాస్పిటల్స్ వంటి నిర్మాణాలకు ఆర్థిక చేయూతనివ్వాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే సంచార గిరిజనులకు రేషన్, ఆధార్‌కార్డులు లేవని, ఐటీడీఏ ద్వారా స్పెషల్‌క్యాంపులు ఏర్పాటుచేసి వారికి కార్డులు మంజూరుచేసి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలుతీసుకోవాలని కోరారు. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర నిధులు అధికభాగం మాచర్ల నియోజకవర్గ గిరిజనులకు కేటాయించాలని అభ్యర్థించారు. పీవో వెంకటశివప్రసాద్ స్పందిస్తూ సాధ్యమైనంత మేర నిధులను కేటాయిమని చెప్పారు.



ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్‌తో సమావేశమైన ఎమ్మెల్యే జూలకంటి

పనులు ప్రారంభించండి.. నిధులు అందిస్తాం

దశాబ్దాలుగా రెంటచింతల మండలంలో గిరిజనులకు ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాల అందుబాటులో లేక వసతిగృహంలోనే తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో గిరిజన బాలుర సంక్షేమ పాఠశాల నూతన భవన నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. 2025 ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కలిసి రెంటచింతలలో గిరిజన విద్యార్థుల సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు నిధులు కేటాయించాలని ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసరును కలిసిన ఎమ్మెల్యే రెంటచింతల గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలకు సంబంధించిన నిధులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. స్పందించిన పీవో వెంకటశివప్రసాద్ రూ.4.10 కోట్ల నిధులను యుద్ధప్రాతిపదికన విడుదల చేస్తామని హామీనిచ్చారు. సమావేశంలో ఐటీడీఏ డీఈ ఇంతియాజ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నారని మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో రూ.33లక్షల తన ఎంపీ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కనకమేడల మాట్లాడుతూ ఉత్తమ బోధన అందిస్తున్న శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయం అన్నారు. ఎంఎల్‌ఏ ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యులు మల్లెల హరేంద్రనాథ్ కోరిక మేరకు కనకమేడల రవీంద్రకుమార్ అందించిన సహకారానికి విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు అమలుచేస్తున్న పి-4 పథకాన్ని ఆదర్శంగా తీసుకుని పేదవిద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ కళాశాల మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో మాజీ ఎంపీ కనకమేడలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ ఆళ్లగడ్డ సురేష్, హైస్కూల్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, ఉపాధ్యక్షుడు పి సత్యనారాయణ, హెచ్‌ఎం రామాంజనేయులు, ఎంపీపీ హనుమంతరావు, ఎంపీడీవో శివపార్వతి, సర్పంచ్ రాజేశ్వరి, ఎంఈఓలు ప్రసాదరావు, శివబాబు, కె.లక్ష్మీనారాయణ, కమిటీసభ్యులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ కనకమేడల, ఎంఎల్‌ఏ ప్రవీణ్

నియోజకవర్గ స్థాయి అధికారులతో కలెక్టర్ నేడు సమీక్ష

పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం స్థానిక ఏవీఆర్ కన్వెన్షన్ హాలులో సమీక్ష నిర్వహిస్తున్నారు. సమావేశానికి మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొంటున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ఎమ్మెల్యే ప్రవీణ్‌తో కలసి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో శివపార్వతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం జంక్షన్ వద్ద 33కేవీ రెంటచింతల ఫీడర్ లైన్ షిఫ్టింగ్ చేస్తున్నందున 33/11కేవీ రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలోని రాయవరం, కంభంపాడు, ఆత్మకూరు, గోపాలపురం, మహబూబ్‌నగర్ గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ రామయ్య తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

దుర్గి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దుర్గి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె వేణు సోమవారం తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం క్లాసులు ప్రారంభమయ్యాయన్నారు. సోమవారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులో శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ యేడాది నూతనంగా ఎంబైపీసీ గ్రూపును కూడా ప్రారంబిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వేణు కోరారు.

మండలానికి 49 యంత్రాల మంజూరు

రెంటచింతల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలను అందిస్తోంది. రెంటచింతల మండలానికి 49 పరికరాలు మంజూరయ్యాయి. వాటిలో 13 స్ప్రేయర్లు, 23 గొర్లు, నాగళ్లు, 1 రోటావేటర్, 12 బ్యాటరీ స్ప్రేయర్లున్నాయి. ఈ పథకాలను పొందేందుకు సన్న, చిన్నకారు రైతులై ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉండాలి. పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, గడిచిన ఐదేళ్లలో ఎలాంటి సబ్సిడీలు పొంది వుండనివారు అర్హులు. రైతుసేవా కేంద్రంలో ఆన్లైన్ ద్వారా ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు.

రేపు పర్యావరణ వేత్త జాజి రచించిన పుస్తకాల ఆవిష్కరణ

కారంపూడి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణానికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు(జాజి) రచించిన ప్రాచీన మూలికావైద్యం, ప్రకృతి పాఠశాల, ప్రకృతివైద్యం, ప్రకృతి ఆహారం పుస్తకాలను ఈనెల 9వ తేదీన గుంటూరులోని జేకేసీ కళాశాలలో ఆవిష్కరించనున్నారు. గుంటూరుకు చెందిన గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్, ఐకాలజీ ప్రొటెక్షన్ సర్వీసెస్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రాలు

రెంటచింతల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాలు ఏర్పాటుచేస్తున్న దాతల ఔదార్యం అభినందనీయమని తహసీల్దార్ అర్జున్‌నాయక్ అన్నారు. సోమవారం పాలువాయిజంక్షన్‌లో పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వీఆర్వో కె.వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

గురజాలటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక అదృశ్యంపై సోమవారం గురజాల పట్టణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. పట్టణానికి చెందిన బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బ్యాగ్ తీసుకొని వెళ్లింది. దీనిపై బాలిక తండ్రి గురజాల పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొడ్లేరులో చలివేంద్రాల ప్రారంభం

క్రోసూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో సీజీజీబీ సీనియర్ మేనేజర్ కే కోటేశ్వరరావు రెండు సెంటర్లలో చలివేంద్రాలు ప్రారంభించారు. రావిపాటి శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాలను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ సోము మస్తాన్‌రెడ్డి, ఇందిరమ్మ శ్రీను, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి వైద్య శిబిరాలు

క్రోసూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ నుంచి నియోజకవర్గంలోని ఐదు మండల కేంద్రాల్లో దశలవారీగా ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయవర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. 9న క్రోసూరు జడ్పీ హైస్కూలు, 11న అచ్చంపేట, 14న బెల్లంకొండ, 16న పెదకూరపాడు, 18న అమరావతిలో వైద్యశిబిరాలు ఉంటాయన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4వరకు కాటూరి మెడికల్ కళాశాల వైద్యబృందంచే సాధారణ వైద్యసేవలు, గుండె, గైనకాలజీ, ఎముకలు, కీళ్ళవైద్యం, చెవి, ముక్కు, గొంతు, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, జనరల్ సర్జన్ వైద్యసేవలతో పాటు షుగర్, రక్తపరీక్షలు, ఈసీజీలు, ఎక్స్‌రేలు ఉచితంగా చేస్తారన్నారు. మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని, క్యాంపునకు వచ్చేవారు ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకొని రావాలన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

నకరికల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ బాలిక ఆదివారం మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. కుంకలగుంట గ్రామానికి చెందిన రమావత్ అనూషాబాయి 7వ తరగతి చదువుతోంది. చదువు రావటం లేదని బడి మానుకుని పొలంపనులకు వెళ్తుంది. అనూషాబాయి తండ్రి హనుమానాయక్ మిషన్ నేర్చుకోవాలని కుమార్తెకు చెప్పగా ఆమె నేర్చుకోకపోవడంతో మందలించాడు. దీంతో మార్చి 31వ తేదీ రాత్రి అనూషాబాయి ఎలుకల పేస్ట్‌ను తిన్నది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తండ్రి హనుమానాయక్ ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి విద్యుత్ బోరు ప్రారంభం

బెల్లంకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం మంచినీటి విద్యుత్‌బోరును ఎంపీడీవో హనిమిరెడ్డి, మండల కోర్‌కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ప్రారంభించారు. మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు టీడీపీ సీనియర్ నాయకుడు వెన్నా సీతారామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వెంటనే కాలనీలో బోరు వేయించారు. సోమవారం విద్యుత్‌బోరు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనిమిరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు కే వెంకటగిరిరెడ్డి, వసంతరావు, టీడీపీ నాయకులు బదూరి సుబ్బారెడ్డి, చావలి రామకృష్ణ, దుగ్గి కృపారావు, అచ్చయ్య, నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

పెదకూరపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లగడపాడు మండల పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంటూరి అంకారావు సహకారంతో ఆదివారం విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీచేశారు. కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు, పూర్వ విద్యార్థి చల్లపల్లి సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 30.27 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువనుంచి 800క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 300 క్యూసెక్కుల నీరు లీకులద్వారా దిగువకృష్ణకు విడుదలవుతుంది.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

మాచర్లటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో మాచర్లలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని చెన్నకేశవకాలనీకి చెందిన పిల్లి ఆంజనేయులు (60) కూలిపనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ఆదివారం రాత్రి కుటుంబసభ్యులు ఇంటిబయట ఉండగా ఆంజనేయులు ఇంట్లో తలుపు గడియపెట్టికొని ఫ్యాన్‌కు వైరుతో ఉరివేసుకున్నాడు. శబ్ధం రావడంతో కుటుంబసభ్యులు వచ్చిచూడగా ఆంజనేయులు ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. అతనిని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య రమణ, ఇరువురు కుమారులు ఉన్నారు.

రీసర్వేపై రైతులకు అవగాహన

మాచవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాచవరంలో భూ రీసర్వేపై సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మంగళవారం నుంచి మాచవరం గ్రామ పరిధిలో రీసర్వే జరుగుతుందన్నారు. ముందుగానే రైతులకు సమాచారం ఇస్తామని, వారు భూములకు సంబంధించిన పత్రాలతో సర్వే అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ స్రవంతి, సర్పంచ్ రాగిడి నరేష్, టీడీపీ నాయకులు యడ్లపల్లి రామారావు, పుసులూరి రామయ్య, కొల్లి కృష్ణమూర్తి, సర్వేయర్ సాల్మన్‌రాజు, మొక్కపాటి శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీలక్ష్మి, వీఆర్ఏలు పాల్గొన్నారు.



సర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

శ్రీశైల మల్లికార్జునుని దర్శించుకున్న ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని సోమవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు దర్శించుకున్నారు. స్వామికి ప్రాతఃకాలంలో పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేకపూజలు జరిపారు. వేదపండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం దేవస్థాన గోశాలలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కుటుంబసభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



శ్రీశైలం మల్లికార్జునుడి సన్నిధిలో ఎమ్మెల్యే జూలకంటి దంపతులు

మాట వినకపోతే ఉద్యోగం పోతుంది

● దళిత అంగన్‌వాడీ కార్యకర్తకు టీడీపీ నేత లైంగిక వేధింపులు
● బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
● అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మాది.. నా మాట వినకపోతే నిన్ను ఉద్యోగం నుంచి తొలగించేలా చేస్తానంటూ దళిత అంగన్‌వాడీ కార్యకర్తను బెదిరించటమే కాకుండా ఆమెను లైంగికంగా వేధిస్తున్న టీడీపీ నేత బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన దళితురాలైన తలతోటి స్వర్ణలత అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. భర్త మూడేళ్ల క్రితం మృతిచెందగా ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బొడ్డు వెంకటేశ్వర్లు చూపు స్వర్ణలతపై పడింది. అర్ధరాత్రిళ్ల ఫోన్‌లు చేసి నా సంగతేమిటి? అంటూ అసభ్యకరంగా మాట్లాడటం చేస్తున్నాడు. అదేమని గట్టిగా ప్రశ్నిస్తే నేను ఎమ్మెల్యే మనిషిని.. నన్నేమి చేయలేవు.. నీకు దిక్కున్న చోట చెప్పుకో అని బెదిరింపులకు దిగాడు. కొద్దిరోజుల నుంచి వేధింపులు మరీ అధికమవ్వటంతో స్వర్ణలత గ్రామ టీడీపీ నాయకుల సహాయంతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ కేసు నమోదు చేయాలని రూరల్ పోలీసులను ఆదేశించారు. స్వర్ణలత ఫిర్యాదు మేరకు ఈనెల 3వ తేదీన రూరల్ పోలీసులు వివిధ సెక్షన్‌లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు. అయినా వెంకటేశ్వర్లు ప్రవర్తనలో మార్పు రాకపోగా మరింతగా లైంగికంగా వేధించటం ప్రారంభించాడు. దీంతో ఆదివారం రాత్రి ఆమె సెల్ఫీ వీడియో తీసింది. వెంకటేశ్వర్లు తనను లైంగికంగా వేధిస్తున్నట్లు చెపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనను ఆదుకోవాలని, లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని వీడియోలో పేర్కొంది. అంతేగాక గతంలో తన భర్త చని పోతే రూ.5లక్షలు బీమా రాకుండా వెంకటేశ్వర్లు అడ్డుకున్నాడని వీడియోలో పేర్కొంది. ఈ వీడియో సోషల్ మీడియాలో కలకలం రేపటంతో రూరల్ పోలీసులు నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. వెంకటేశ్వర్లును ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి జుడిషియల్ కస్టడీకి తరలించినట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు సోమవారం తెలిపారు.



తనిఖీలలో విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

● రూ.5.04 లక్షల అపరాధ రుసుం

గురజాలటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం మండలంలోని దైద, గంగవరం, జంగమహేశ్వరపురం, మోదుగుల, పల్లెగుంత, అంజనాపురం, నాగార్జుననగర్, రామకృష్ణాపురంలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగయ్య నేతృత్వంలో 51మంది అధికారులు, 163మంది సిబ్బంది 51 బృందాలుగా ఏర్పడి 4645 విద్యుత్ సర్వీసులను తనిఖీచేశారు. మీటరు లేకుండా విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్న 44మందికి రూ.62వేలు, మీటరు ఉండి విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్న 20 మందికి రూ.2.06లక్షలు, ఇతర కేటగిరిలో విద్యుత్ వినియోగించుకుంటున్న ముగ్గురికి రూ.15వేలు, అదనపులోడు వినియోగిస్తున్న 59మందికి రూ.2.01లక్షలు, అసలు వాడకంకంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన 2 సర్వీసులు గుర్తించి రూ.20వేలు మొత్తం రూ.5.04లక్షల అపరాధరుసుం విధించారు. తనిఖీల్లో డీఈఈలు రవికుమార్, మల్లికార్జునప్రసాద్, శ్రీనివాసరావు, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, సతీష్‌కుమార్, శివశంకర్, విజ్ఞాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అచ్చంపేటలో ఘనంగా పట్టాభిషేక మహోత్సవం

అచ్చంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీవాసవి మాఘమాస సమారాధన సంఘం అధ్యక్షుడు కోటా సాంబశివరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

క్రోసూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పెరికపాడులో టీడీపీ సభ్యత్వ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రోసూరు మండల తెలుగు యువత నాయకుడు జడ సుబ్బు, పార్టీ నాయకులు ఇజ్రాయేలు, రామారావు, ఏసోబు, రాజు, వెంకటరరావు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ట్రస్టును ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర వైసీపీ వైద్యవిభాగం అధికారప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆరోపించారు. సోమవారం పట్టణ వైసీపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మీద ఆరోగ్యశ్రీకి రూ.3,500కోట్ల బకాయిలు వున్నాయని, ప్రైవేటీకరిస్తే ఈ బకాయిలు ఎప్పుడు ఎవరు తీరుస్తారన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు.

12వ వర్ధంతి



జననం : 1-1-1961
కీ॥శే॥ వెల్లంకి సాంబశివరావు గారు
మరణం : 8-4-2013
డైరెక్టర్ : విద్యా కేంద్రం విద్యాసంస్థలు, సత్తెనపల్లి
మీరు మరచిపోయే జ్ఞాపకం కాదు. మాది మర్చిపోయే మనస్సు కాదు.
మా నుండి దూరం అయి 12 వసంతాలు గడిచినా మా మనస్సులో ప్రతిక్షణం ఉన్నారు.
We Miss You a lot
భార్య : వెల్లంకి రాజ్యలక్ష్మి
కుమారుడు - కోడలు : వెల్లంకి అరుణ్ కుమార్ - హారిణి
మనవళ్ళు : దేవాన్ష్ వెల్లంకి, వేదాన్ష్ వెల్లంకి
కుమారుడు - కోడలు : వెల్లంకి వరుణ్ కుమార్ - శ్వేత
మనుమరాలు: ఇషా వరుణ్ వెల్లంకి, మనవడు : రిషి కార్తికేయ వెల్లంకి

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రః 99854 11226, 99854 11220
99852 07026

నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంప్‌లు

వినుకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రభుత్వ ఆధార్ సర్వీసులకు సంబంధించిన నూతన ఆధార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని 4వ వార్డు సచివాలయంతో పాటు, ఓబయ్యకాలనీలోని 9వ వార్డు సచివాలయంలో ఆధార్ స్పెషల్ క్యాంప్‌ల ద్వారా ఆధార్ బయోమెట్రిక్, డేటా గ్రాఫిక్ అప్‌గ్రేడ్, ఆధార్ డౌన్‌లోడ్, కలర్ ప్రింట్ తదితర సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30లోపు పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీ

వినుకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను, ఖాళీ స్థలానికి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఏకమొత్తంలో చెల్లించినట్లయితే 5శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్ను బకాయిదారులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగించుకొని ఇంటి పన్ను చెల్లించాలని ఆయన కోరారు.

సెలవు దినాల్లోనూ పన్ను చెల్లించవచ్చు: కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలం పన్నులను చెల్లింపులకు ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లు సెలవు దినాల్లోనూ పనిచేస్తాయని కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏకమొత్తంగా 30వ తేదీలోగా చెల్లిస్తే 5శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉదయం 9.00గంటల నుంచి సాయంత్రం 6.00గంటల వరకు పురపాలక సంఘం కార్యాలయంలో ఈ ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయన్నారు. ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీడీఎంఏ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చని కమిషనర్ తెలిపారు.

ఆయుర్వేద వైద్యుడు చిలకల ఆంజనేయులు మృతి

వినుకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు చిలకల ఆంజనేయులు (83) ఆదివారం రాత్రి మృతిచెందారు. వినుకొండ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఆయన అనేక సంవత్సరాలుగా ఆయుర్వేద వైద్యం చేస్తూ అందరికీ సుపరిచితులు. ఆయన మృతి వార్త తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఫోన్‌లో సంతాపాన్ని తెలియజేశారు. అదేవిధంగా సీనియర్ న్యాయవాది పీజే లూకా, కాకాని నాగేశ్వరరావు తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంజనేయులు వినుకొండ ప్రజలకు చేసిన వైద్యసేవలను స్మరించుకున్నారు.

వైభవంగా నలగార్లపాడు ఆంజనేయ స్వామి తిరునాళ్ళ

రొంపిచర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజోతి): మండలంలోని నలగార్లపాడులోని ఆంజనేయస్వామి తిరునాళ్ళ సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. నాగవల్లి దళార్చన పూజలను నిర్వహించారు. మాచవరం, నలగార్లపాడు, పరగటిచర్ల, బెహరావారిపాలెం గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు పొంగళ్ళు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

12న అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

రొంపిచర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల చెరువు కట్ట సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన అంకమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంకమ్మ తల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నాయి.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి: కాసా

రొంపిచర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఐ ఏరియా జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరారు. రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలబిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. మార్చి 23 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రచార ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, మధు, హుస్సేన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా ఏడుకొండలు ప్రమాణ స్వీకారం

ఈపూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండేపల్లి పంచాయతీ సర్పంచ్‌గా అబ్బూరి ఏడుకొండలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన కాసరగడ్డ మల్లికార్జునరావు ఒప్పందంలో భాగంగా రాజీనామా చేశారు. ఉప సర్పంచ్ ఏడుకొండలు సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, బొల్లా వెంకట కోటయ్య, మండల పార్టీ అధ్యక్షుడు టీ బాలయ్య, న్యాయవాదులు సైదారావు, రామకోటేశ్వరరావు, అయినాల కోటేశ్వరరావు, నర్రా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి చిన్నదే.. సమస్యలు పెద్దవి..!

- తక్కువ ఎత్తులో విద్యుత్ సర్వీస్ వైర్లు
- సమస్యలతో నిత్యం సతమతం
- ఆ వీధిలోనే వార్డు కౌన్సిలర్ నివాసం



ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న సర్వీసు వైర్లు, మురుగు కాల్వలో ఉన్న నీటి పైపులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని దక్షిణం బజారు (పప్పు బజారు) అంటే నియోజకవర్గ ప్రజలకు పరిచయం అక్కరలేదు. గతంలో వ్యాపారానికి ఆ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. నేడు ఆ ప్రాంతంలోని దుకాణాలు అన్నీ వినుకొండ కొత్త పట్టణానికి చేరుకోవడంతో ఆ ప్రాంతంలోని ప్రజలు నివాసానికి మాత్రమే వినియోగించుకుంటున్నారు. ఏళ్ల తరబడి నివాస ప్రాంతంలో స్థానికులు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2005 పురపాలక సంస్థగా ఆవిర్భవించినప్పటికీ స్థానికుల సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. దక్షిణం బజారులోని 18వ వార్డు మునిసిపల్ కౌన్సిలర్ పాల్వాది ఆంజనేయులు నివాసం ఉంటున్న ప్రాంతాన్ని చూస్తే ఆశ్చర్యానికి గురవ్వాల్సిందే. ఐదు అడుగుల బజారులో కేవలం 25 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఆ ప్రాంత నివాస గృహాలకు దక్షిణం బజారు నుంచి నివాస గృహాల వరకు విద్యుత్ తీగలు కిందకు వేలాడటంతో ప్రమాదం పొంచి ఉంది. ఇదిలాఉండగా మునిసిపాలిటీ పైపులు సైతం మురుగు కాలువలోనే ఉన్నాయి. ఇంటికి ఏర్పాటుచేసిన మీటర్లు రీడింగ్ తీయాలన్నా విద్యుత్ శాఖ సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. మీటర్లను ఏర్పాటుచేసే స్థలాలు లేక అవి చేతికి అందే ఎత్తులో కిటికీల్లో మీటర్లు ఏర్పాటుచేశారు. ఇప్పటికైనా పాతపట్టణంలోని ఇరుకైన బజారులో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మునిసిపల్ అధికారులు దృష్టిసారించి స్థానికులకు పొంచి ఉన్న ప్రమాదాలను తొలగించి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



కిటికీల్లో బిగించిన విద్యుత్ మీటర్లు

అధికారం శాశ్వతమనే అహంకారంతో...

దారుణాలకు పాల్పడిన వైసీపీ నాయకులు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శాశ్వతంగా తామే అధికారంలో ఉంటామన్న అహంకారంతో వైసీపీ నేతలు గతంలో అనేక దారుణాలకు పాల్పడ్డారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం ఆరోపించారు. పట్టణంలో ప్రజా ఫిర్యాదుల వేదికను నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ బాధితుల్లో కేవలం ఒక శాతం మాత్రమే బయటకు వచ్చారని, ఇంకా 99 శాతం బయటకు రావాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందున్న నమ్మకంతో బాధితులు తమ సమస్యల్ని బయటకు చెప్పుకుంటున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఇతర ప్రధానాధికారులు బాధ్యత తీసుకొని ప్రజల సమస్యలు పరిష్కరిస్తేనే ప్రభుత్వంపై జనాలకు నమ్మకం, విశ్వాసం కలుగుతాయని, అప్పుడే మిగిలిన వారు కూడా తమ సమస్యల్ని బహిర్గతపరుస్తారని చెప్పారు. చిలకలూరిపేట నుంచి ప్రాతినిధ్యం వహించిన అవినీతి మంత్రి అనుచరులు చాలామంది ఇప్పటికే భయంతో రాష్ట్రాలు దాటి పారిపోయారని అన్నారు. ప్రత్తిపాటి తెలిపారు. మాజీమంత్రి మామ ప్రజలకు ఉపయోగపడే రోడ్డు తనదని నమ్మించి, తిరిగి తానే జనానికి రాసిచ్చినట్టు నాటకమాడితే, ఆయన కొడుకేమో ఆ రోడ్డు తమదేనంటూ న్యాయస్థానాల్లో స్టే తీసుకొచ్చాడన్నారు. పసుమర్రు గ్రామస్థులు రోడ్డు ఆక్రమణపై కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదే అందుకు నిదర్శనమని, ఆ రోడ్డు కథేంటో తేల్చి గ్రామస్థులకు న్యాయం చేయాలని ప్రత్తిపాటి సభాముఖంగా కలెక్టర్‌ను కోరారు. అదేవిధంగా సెంటు పట్టాల పేరుతో జరిగిన భూసేకరణలోని లొసుగుల్ని కూడా బయటపెట్టి ఆ ఊరి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఏ సమస్య మూలాల్లోకి వెళ్లినా ఎక్కడో ఒకచోట మాజీమంత్రి, ఆమె కుటుంబ పాత్ర, ప్రమేయం ఉందని, దాని ప్రభావమే నేటికీ ప్రజలు పడుతున్న బాధలన్నారు. డ్వాక్రా మహిళలు బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాల్ని కాజేసిన వ్యవహారంపై కూడా విచారణ జరిపించి, అసలు దొంగలెవరో కనిపెట్టి కఠినంగా శిక్షించాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. నియోజకవర్గవ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో రూ.4కోట్ల వరకు కాజేసినట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ సమస్యపై పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి పల్నాడు జిల్లాకు మంచి కలెక్టర్‌ను నియమించారని, ఆయన ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సమస్యలపై వేగంగా స్పందిస్తున్నారన్నారు..

గ్రీవెన్స్‌లో ప్రజలనుంచి పలు అర్జీలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో సోమవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ బి.అరుణ్ బాబుల సారథ్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి గ్రీవెన్స్ లో ప్రజలు పలు సమస్యలపై అర్జీలను అందచేశారు. చిలకలూరిపేటకు రైల్వే లైన్ ఏర్పాటు చేయించాలని చిలకలూరిపేట రైల్వే లైన్ సాధన సమితి కన్వీనర్ సీపీఐ సుభాని తదితరులు కోరారు. ఎంపీ కృష్ణదేవరాయలు స్పందించి రైల్వే మంత్రికి విషయం తెలియచేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి విడదల రజిని, విడుదల గోపి, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ముగ్గురు కలిసి రూ.7కోట్ల మేరకు అవినీతికి పాల్పడ్డారని మల్లెల శివ నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. చీరాల రోడ్డు పసుమర్రు గ్రామ పరిధిలో అనధికార లేఔట్ లో 16 భవనాల నిర్మాణానికి అనుమతి ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ మునిపల్ కమిషనర్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీలకు చెందిన పెండింగ్ సమస్యలపై ముస్లిం నేతలు వినతిపత్రం అందచేశారు. మంజూరైన మైనారిటీ బాలికల వసతి గృహం నిర్మించాలని, పోతవరం గ్రామంలో ఆటోనగర్ నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని, పసుమర్రు గ్రామంలో షాదీ ఖానా నిర్మాణం పనులు చేపట్టాలని, పలుచోట్ల కమ్యూనిటీ భవనాలు, ఖబర్‌స్థాన్‌లు నిర్మించాలని పఠాన్ సమద్‌ఖాన్, ముల్లా కరిముల్లా, షేక్ అజహరుద్దీన్, మస్తాన్ వలి కోరారు. కాగా అడపా అశోక్, షేక్ దరియావలి అర్జీలు అందించేందుకు వచ్చిన వారికి మజ్జిగ, లస్సీ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

రంగస్థలాన్ని ఆదరించాలి

● నాటకోత్సవాల ముగింపు సభలో తెలంగాణ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, వేదికపై అజయ్‌ఘోష్, కెఎస్ లక్ష్మణరావు, రవిమారుతి, గంగాధరరావు, మోహనరావు, నాయుడు గోపి తదితరులు

యడ్లపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రంగస్థలాన్ని, రంగస్థల కళాకారులను వాటిని నిర్వహించే పరిషత్ నిర్వాహకులను ఆదరించి ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటకోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. కళానిలయం ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సినిమా, సీరియల్స్ ఎన్ని ఉన్నా నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలను కళ్ళకు కట్టినట్లు చూపగలిగేది నాటకమన్నారు. రెండు దశాబ్దాలకు పైగా నాటకోత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను, ఆదరిస్తున్న ప్రేక్షకులను ఆయన అభినందించారు.


సమాజంలో సమస్యలు కోకొల్లలు: మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నాటకరంగంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత ఉందని, ఇప్పటికీ 60కి పైగా గ్రామాల్లో ఏటా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. వాటిలో యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాలకున్న స్థానం మరీ ప్రత్యేకమైనదన్నారు. 22సంవత్సరాలుగా నిర్వహిస్తుండడం విశేషమన్నారు. వాటిలో తాను పదకొండు నాటకోత్సవాలకు హాజరు కావడం తన అదృష్టమన్నారు.

సమాజంలో దుర్మార్గపు పరిస్థితులు: సినీనటుడు అజయ్ ఘోష్

నేడు సమాజంలో దుర్మార్గపు పరిస్థితులు ఉన్నాయని ఆలోచించి సరిదిద్దుకోకుంటే ఒకరికి ఒకరు కాకుండా పోయే ప్రమాదముందని సినీ నటుడు అజయ్‌ఘోష్ అన్నారు. యూట్యూబ్, సోషల్ మీడియాలో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వాడడం, బతుకు బజారున వేసుకోవడం, ఆడవారిని బయటకు లాగడం, సంస్కృతి సంప్రదాయాలకు తిలోదకాలు ఇవ్వడం వంటి దారుణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అలాంటి పరిస్థితులలో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు నాటకం ఒక్కటే సరైన ఆయుధమన్నారు. ప్రతి ఏటా నాటకోత్సవాలకు వస్తానన్నారు. ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంగాధరరావు, హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత పోపూరి రవిమారుతి, వేదిక ప్రధాన కార్యదర్శి జేవీ మోహనరావు, టీవీ, రంగస్థల నటుడు, దర్శకుడు నాయుడు గోపిలు 22ఏళ్ళుగా నాటకోత్సవాలు నిర్వహించడంపై అభినందనీయమన్నారు. అనంతరం కళానిలయం అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం చేయగా కోశాధికారి నూతలపాటి మాధవరావు వందన సమర్పణ చేశారు.

యడ్లపాడు ఎస్ఐగా శివరామకృష్ణ బాధ్యతల స్వీకారం



యడ్లపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా టి.శివరామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వి.బాలకృష్ణ బదిలీపై ఏప్రిల్ 4న పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ఎస్‌బీకి బదిలీపై వెళ్ళారు. ప్రస్తుతం చిలకలూరిపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న టి.శివరామకృష్ణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సోమవారం విధుల్లో చేరిన శివరామకృష్ణకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ కేసుల్లో జైలు జరిమానా

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేరువేరు చోట మోటార్ సైకిల్ దొంగిలించినట్లు నేరం రుజువు అవడంతో నిందితుడు పట్టణంలోని వరవ కట్టకు చెందిన షేక్ అష్రఫ్‌కు ఒక్కొక్క కేసులో మూడు నెలల జైలు శిక్ష రూ.1000 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి టి.ప్రవళిక సోమవారం తీర్పు వెలువరించారు. నిందితుడు 2024 సంవత్సరంలో మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మూడు ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో అభియోగపత్రం దాఖలుచేశారు. విచారణలో నేరం రుజువడంతో పైవిధంగా కోర్టు తీర్పు ఇచ్చింది. మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ కేసును దర్యాప్తు చేశారు. కోర్టు కానిస్టేబుల్ దుర్గయ్య సాక్షులను ప్రవేశపెట్టి త్వరితగతిన కేసు రుజువయ్యేలా ప్రాసిక్యూషనుకు సహకరించారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ లక్ష్మీరామ్‌నాయక్ నిర్వహించారు.

'నాన్ టీచింగ్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేసవిలో కూడా జీతాలు ఇచ్చి కొనసాగించాలి'

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేసవిలో కూడా జీతాలు ఇచ్చి కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మోడల్ స్కూల్ అటెండర్ అండ్ వాచ్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సోమవారం డిమాండ్ చేసింది. ఏపీ మోడల్ స్కూల్స్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాలో ఆఫీస్ సబార్డినేట్స్ వాచ్‌మెన్స్ అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా పని చేస్తున్నామన్నారు. ఎండాకాలంలో టెర్మినేట్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అన్ని శాఖలలో అందరికీ 12నెలలు జీతాలు ఇస్తూ, మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న అటెండర్లు, వాచ్‌మెన్లు ఏ పాపం చేశారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్స్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెంచి, తమ కుటుంబాలను ఆదుకోవాలని, ఎంటీఎం అమలు చేయాలని అసోసియేషన్ నాయకులు వినుకొండ పేరయ్య, ఎస్.సాంబశివరావు, టీ రామారావు, పీ ఏసుపాదం కోరారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో మోసం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీ పేరుతో తమను మోసగించారని బాధితులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాదులోని కర్మన్‌గూడ జిల్లెలగూడ ఎస్‌బీఐ పైఅంతస్తులో సైతాన్ కాయిన్ క్రిప్టో కరెన్సీ ఆన్‌లైన్ నెట్‌వర్క్ పేరుతో వి నాగేశ్వర్, గుంటూరుకు చెందిన ఏజెంట్ పూల రవి కుమార్‌లు సుమారు రూ.60లక్షల మేరకు తమను మోసగించినట్లు పట్టణానికి చెందిన జి వెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సతీష్, శ్రీనివాస్‌లు ఫిర్యాదు చేశారు. తమను నమ్మించి తమతో పెట్టుబడి పెట్టించారన్నారు. తదుపరి తమకు రావలసిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ కుంటి సాకులు చెబుతూ మభ్యపెడుతున్నారన్నారు. తమకు రావలసిన నగదును చట్ట ప్రకారం ఇప్పించి న్యాయం చేయవలసినదిగా ఫిర్యాదు చేశారు.

పారిశ్రామికవేత్తలకు అనుకూల ప్రాంతం ఏపీ

● విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మురికిపూడిలో గ్రానైట్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య, బడా పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అనుకూల ప్రాంతమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం అన్నారు. చిలకలూరిపేట మండలం మురికిపూడిలో ఒక ప్రైవేటు గ్రానైట్ ఫ్యాక్టరీని మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిరంగాల పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన వారికి రాయితీలను ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారస్థులు, పెట్టుబడిదారుల విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యల కారణంగానే దేశంలో వృద్ధిరేటు మెరుగ్గా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలోకి వచ్చిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నేడు వ్యాపారస్థులపై కక్షసాధింపు చర్యలు లేవని చెప్పారు. వ్యాపారస్థులు వ్యాపారం చేసుకోవాలి అంటే నాడు జగన్‌కు కప్పం కట్టాల్సి వచ్చేదని విమర్శించారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం వ్యాపారులను ప్రోత్సహిస్తుందని మంత్రి గొట్టిపాటి అన్నారు. అంతేగాకుండా ఏపీలో స్వేచ్ఛాయుత వ్యాపారానికి కూటమి ప్రభుత్వం సహకరిస్తోందని అన్నారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

బాలల హక్కులను పరిరక్షించాలి

● కమిషన్ సభ్యురాలు పద్మావతి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతంగా జవాబుదారీతనంతో బాలల హక్కులను పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. సోమవారం నరసరావుపేట మండలం లింగంగుంట్ల రాజుపాలెం వాటర్‌ట్యాంక్ సమీపంలో ఉన్న ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో 32మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాలల భద్రత ప్రశ్నార్థకంగా తయారైందన్నారు, రేల్వే ట్రాక్ పక్కన ఇరవై అడుగుల దూరంలో టాయిలెట్ల పక్కన సేఫ్టీవాల్ లేనందున ప్రమాదం ఉన్నట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన కమిషన్ జిల్లా విద్యాశాఖ అధికారికి 15రోజులలో సేఫ్టీవాల్ నిర్మించాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లబ్దిదారులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న టీహెచ్‌ఆర్ టేక్‌హోమ్ రేషన్ సక్రమంగా అందుతుందా లేదా అని తల్లులను అడిగి తెలుసుకున్నారు. గర్భవతులకు, బాలింతలకు టీహెచ్‌ఆర్ సంజీవని కిట్స్ అందించారు. పదో తరగతి పూర్తయిన పిల్లలందరూ కూడా కేజీబీవీ గురుకులంలో ఇంటర్మీడియట్ ప్రవేశం పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి,డీసీపీవో డీ శౌరి, డీసీపీవో రేవతి, సూపర్‌వైజర్ పార్వతి, హెచ్‌ఎం మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 88 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి 88 ఫిర్యాదులు అందాయి. సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్ బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలోగా త్వరితగతిన పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆయన ఆదేశాలు జారీచేశారు.



తులసీ తన్మయ్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

తైక్వాండోలో ఎస్ఎస్ఎన్ విద్యార్థికి బంగారు పతకం

నరసరావువపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాడెట్ అండ్ తైక్వాండో చాంపియన్‌షిప్ అండ్ ఆంధ్రప్రదేశ్ కప్-2025లో స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో నర్సింగ్ కోర్సు విద్యార్థి వీ తులసీ తన్మయ్ 49కిలోల లోపు విభాగంలో బంగారుపతకం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ మువ్వల సుబ్రహ్మణ్య సుధీర్ సోమవారం తెలిపారు. తెనాలిలోని లక్ష్మీనరసింహ సోమయాజీ వైశ్య వ్యాయామ ఇండోర్ స్టేడియంలో 2, 3 తేదీలలో జరిగిన ఈ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. వీ తులసీ తన్మయ్ ఆగస్టులో ఢిల్లీలో జరిగే 5వ జాతీయ క్యాడెట్ అండ్ జూనియర్స్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందన్నారు. వీ తులసీ తన్మయ్‌ని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పానుగంటి శ్రీనివాససాయి, నర్సింగ్ ఇన్‌చార్జి ఏవీఎన్ గుప్తా, పీడీ డాక్టర్ యక్కల మధుసూధనరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆహార పదార్థాలను పరిశుభ్ర ప్రదేశంలో ఉంచాలి

● పల్నాడు జిల్లా ఆహార భద్రత అధికారి లక్ష్మీనారాయణ

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అందించే ఆహార పదార్థాలను పరిశుభ్ర ప్రదేశంలో ఉంచాలని పల్నాడు జిల్లా ఆహార భద్రత అధికారి లక్ష్మీనారాయణ సోమవారం ఆదేశించారు. పట్టణంలోని బాలయ్య నగర్‌లో రెండు సంవత్సరాల బాలిక బర్డ్ ఫ్లూతో మరణించిన నేపథ్యంలో రెండు రోజులుగా ఆయన పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని డైట్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాలు తయారుచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆహార పదార్థాలకు సంబంధించి రెండు శాంపిల్స్‌ను తనిఖీ నిమిత్తం పంపారు.